తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## నేడు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్త:
పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు నేడు తిరుపతి, చిత్తూరులో పర్యటించనున్నారు. చిత్తూరులోని ఎస్.పి. సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల స్నాతకోత్స వానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. నేటి ఉదయం హైదరాబాద్ నుంచి 7.40 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి చిత్తూరు వెళతారు. ప్రభుత్వ మహిళా కళాశాల స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొననున్న ఆయన, కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం స్నాతకోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేసుకుని అక్కడ నుంచి కాట్పాడి చేరుకుని, రైలు మార్గంలో చెన్నై బయలుదేరి వెళతారు.

## రెండు లారీలు ఢీ .. ఇద్దరికీ గాయాలు



రేణిగుంట ఏప్రిల్ 8 ప్రభాతవార్త
రేణిగుంట కోడూరు ప్రధాన రహదారిపై తిరుపతి జిల్లా మామండూరు వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు లారీలు ముందు భాగాలు పూర్తిగా దెబ్బతిని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా మహారాష్ట్ర రాష్ట్రం షోలాపూర్ జిల్లా మెటకరవడి గ్రామానికి చెందిన విజయ్ బాలు కొకరే (25) అహ్మదాబాద్ నుండి చెన్నైకు మెడికల్ పరికరాల లోడుతో క్లీనర్ శుభం కాక సాహెబ్ జుబారే(21)తో కలిసి వస్తుండగా రేణిగుంట వైపు నుండి కోడూరు వెళ్తున్న లారీఢీకొంది. రెండు లారీలు చాలా వరకు ధ్వంసం అయ్యాయి. రెండు లారీలకు చెందిన వారు గాయపడ్డారు. గాయపడిన లారీ క్లీనర్ శుభం కాక సాహెబ్ జుబారే, మరొక లారీ డ్రైవర్ చోటు యాదవ్ ప్రస్తుతం రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అర్బన్ సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు ఎస్ఐ ధర్మారెడ్డి సంఘటనా స్థలం చేరుకొని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు..

## మధ్యాహ్న భోజనంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

### - ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదిని పరిశీలించి, విద్యార్థినులతో నేరుగా మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యత, కోడిగుడ్ల పంపిణీ గురించి ఆరా తీశారు. ఈ తనిఖీలో గుడ్ల పంపిణీలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఎమ్మెల్యే స్వయంగా గుర్తించారు. మొదటి ఏజెన్సీ పరిధిలో 423 మంది విద్యార్థులకు గాను కేవలం 269 గుడ్లు మాత్రమే పెట్టారని, రెండవ ఏజెన్సీ పరిధిలో 153 మందికి గాను కేవలం 60 గుడ్లు మాత్రమే ఉడకబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు అందరూ పిల్లలు గుడ్డు తింటామని చెబుతున్నా, ఏజెన్సీలు మాత్రం సగం గుడ్లు మాత్రమే వండి, మిగతావి పక్కదారి పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రోజువారీగా ఏజెన్సీలు ఎంత మందికి భోజనం వండుతున్నారు, ఎన్ని గుడ్లు పెడుతున్నారని లెక్క చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులపై ఉందని గుర్తుచేశారు. రోజుకు పది నిమిషాలు కేటాయించి పిల్లలకు న్యాయంగా అందాల్సిన ఆహారం అందుతుందో లేదో ఎందుకు తనిఖీ చేయడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో లాగా ఇష్టారాజ్యంగా దోచుకుంటామంటే కుదరదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, నాణ్యమైన సన్న బియ్యం, పౌష్టికాహారం అందిస్తుంటే, ఇలాంటి ఏజెన్సీలు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈగ కిరణ్, ఏఎంసి చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 2027 ఆఖరు వరకు గ్రేటర్ తిరుపతి కలే!?

### -జనగణన పేరుతో లేదంటూ తేల్చేసిన మంత్రి

ప్రభాతవార్త-తిరుపతి:
యాత్రాస్థలంగా, పుణ్యక్షేత్రంగా ప్రపంచప్రఖ్యాతిగాంచిన తిరుపతినగరాన్ని గ్రేటర్ తిరుపతిగా మార్పుచేయాలని గత ఏడాది కార్పొరేషన్ కౌన్సిల్ చేసిన తీర్మానానికి అడుగడుగునా అడ్డంకులు తగులుతున్నాయి. అదే ఇదో గ్రేటర్ తిరుపతి అంటూ అప్పటి నుండి ఇటీవల పదవీకాలం ముగిసిన కౌన్సిల్ కూడా ప్రగల్భాలు పలికింది. ఏకంగా కొందరు కార్పొరేటర్లు మొదటి కౌన్సిల్, చివరి కౌన్సిల్ కూడా తమదేనని, తామే చరిత్రలో నిలిచిపోయే కార్పొరేటర్లుగా భుజాలెగురవేశారు. అయితే గత ఏడాది ప్రతిపాదనలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదనేది ఇటీవల స్వయంగా రాష్ట్రపురపాలక శాఖమంత్రి డాక్టర్ నారాయణ వ్యాఖ్యలతో స్పష్టమైపోయింది. దీంతో ఇప్పటికిప్పుడు 2027 జూన్‌వరకు గ్రేటర్ తిరుపతిగా మార్పుచేసే అవకాశం లేదని తేల్చేశారు. ప్రస్తుతానికి ఆ ప్రక్రియ ఆగిపోయిందని మంత్రి స్పష్టం చేయడం మాజీ కార్పొరేటర్లను నిరుత్సాహపరిచింది. జనగణన ప్రారంభం కానుండంతో ఈ నేపథ్యంలో 2027 మార్చి 31వరకు డీలిమిటేషన్ ప్రక్రియ ఆగిపోయిందని వ్యాఖ్యానించారు. గ్రేటర్‌పరిధిలోకి వచ్చే ప్రాంతాలు వదలిపెట్టి మిగిలిన ప్రాంతాల్లో యధావిధిగా ఎన్నికలు జరిపిస్తామని, జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయిన తరువాతే గ్రేటర్ తిరుపతి అంశంపై కీలక నిర్ణయం తీసుకునే వీలుంటుందనేది ప్రభుత్వపెద్దల మాట. ఇప్పటికైతే తిరుపతి నగరం మహానగరంగా రూపుదిద్దుకునే పరిస్థితి లేదనేది





నగరవాసుల్లో వ్యక్తమవుతున్న వ్యాఖ్యలు. 30 చదరపుకిలోమీటర్ల నుండి 284 చదరపుకిలోమీటర్ల విస్తీర్ణంతో, జనాభా 4.5 లక్షల నుండి 7.5 -10లక్షలకు పైగా జనాభాతో ఈ విస్తరణ ప్రణాళికను గత ఏడాది మాజీ కౌన్సిల్ ప్రతిపాదించింది. 10 లక్షలకు పైగా జనాభా ఉండాలంటే చుట్టుపక్కల గ్రామపంచాయతీలను విలీనం చేసుకోవాలి. ఇందుకు జిల్లా యంత్రాంగం కూడా పలు పంచాయతీలను తిరుపతి నగరంపరిధిలోకి తీసుకువచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 10 లక్షల జనాభా ఉంటేనే తిరుపతికి మరింత అభివృద్ధి అవకాశాలు వస్తాయనేది గత కౌన్సిల్ చేసిన తీర్మానం కూడా. చుట్టుపక్కల మండలాలు, గ్రామాలు 53 గ్రామ పంచాయతీలతో పాటు 10 రెవెన్యూ గ్రామాలు తిరుపతి రూరల్ మండలంలోని బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం, గాంధీపురం, పెరుమాళ్లపల్లి, పుదిపట్ల, చంద్రగిరి మండలంలోని రాయలపురం, బుచ్చినాయుడుపల్లె, పిచ్చినాయిడుపల్లె, రేణిగుంట మండలంలోని అత్తూరు, ఆర్సీ పురం మండలంలోని సి.రామాపురం గ్రామ పంచాయతీలను చేర్చాలనేది ప్రతిపాదిత ఆలోచన. మరీ ప్రభుత్వం, సిఎం చంద్రబాబునాయుడు సొంతప్రాంతంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది కూడా సంచలనమే.

## చిత్తూరు జిల్లాను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దుతా

### - రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మెన్ కెఎస్ జవహర్

చిత్తూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:
చిత్తూరు జిల్లాను ఒక మోడల్, కుల వివక్ష రహిత జిల్లా, అట్రాసిటి ఫ్రీజోన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఎస్సీకమీషన్ చైర్మెన్ కెఎస్ జవహర్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన షెడ్యూల్ కులాల ప్రజల నుంచి వినతులను స్వీకరించిననంతం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఎస్సీకమీషన్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం పనిచేస్తుందని ముఖ్యంగా భూ సమస్యలు, భూతగాదాలు వంటి సమస్యలు ఎక్కువగా వున్నట్లు గుర్తించామన్నారు. కాస్ట్ సర్టిఫికేట్ సమస్యల విషయంలో కూడా గతంలో ఆది ఆంధ్ర, ఆది ఆంధ్ర క్రిస్టియన్ వంటి వర్గీకరణలు కారణంగా కొన్ని ఇబ్బందులు వున్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకొని పరిష్కార మార్గాలపై సమీక్ష జరుపుతున్నామన్నారు. జిల్లాలోని 53 విభాగాలకు సంబంధించిన సంక్షేమపథకాలు అందరికీ సమానంగా చేరుతున్నాయా లేదా అన్న దానిపై కూడా సమీక్ష చేపట్టినట్లు తెలిపారు. తాను కమీషన్ చైర్మెన్‌గా 15శాతం రిజర్వేషన్ పరిధిలో వచ్చే దళితఉుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన బాధ్యత వుందన్నారు. చిత్తూరు జిల్లాలో సుమారు 25శాతం దళిత జనాభా వున్న నేపధ్యంలో వారి సంక్షేమం, అభివృద్ధిలలో భాగస్వామ్యం గురించి సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టరు, ఎస్పీలతో సమావేశమై తగిన ఆదేశాలు ఇచ్చామని, తీసుకుంటామన్నారు. జిల్లాకు కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు నిర్ధిష్ట శాతంలో ఖర్చుచేయకపోతే, సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేస్తే ఖచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తామన్నారు. దళిత క్రైస్తవుల సమస్యలపై మాట్లాడుతూ 1950 అధ్యక్ష ఉత్తర్వు ప్రకారం వచ్చిన అంశాలే ప్రస్తుతం మళ్లీ చర్చకు వస్తున్నాయన్నారు. ఇతర ప్రయోజనాల కోసం కులం పేరుతో ఎవరైనా అడ్డుకుంటే వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలో మార్పులు వచ్చినా, వివక్షకు సంబంధించి పునాదులు ఇంకా కొనసాగుతున్నాయన్నారు.

## పారదర్శకంగా లాటరీ ద్వారా దుకాణాలు



తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్త:
తిరుపతి నగరపాలకసంస్థ పరిధిలో ఈట్ స్ట్రీట్ లో దుకాణాలను పారదర్శకంగా లాటరీ విధానంలో కేటాయించారు. ఈ విధానంతో వ్యాపారులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. దుకాణాలు పొందిన వాళ్ళు ప్రభుత్వ నియమ నిబంధనలననుసరించి వ్యాపారాలు నిర్వహించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య సూచించారు. భారత ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్ లోని 14దుకాణాలకు బుధవారం కచ్చపి ఆడిటోరియంలో లక్కీ డ్రా నిర్వహించారు. కమిషనర్ ఎన్. మౌర్య స్వయంగా పాల్గొని లక్కీ డ్రా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన 14దుకాణాలకు పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించామని తెలిపారు. ఇందులో 13దుకాణాలు లాటరీ ద్వారా అభ్యర్థులకు కేటాయించగా, 10వ నెంబర్ దుకాణం ఐ స్టోన్ కంపెనీకి నేరుగా కేటాయించామని తెలిపారు. దుకాణదారులు ఖచ్చితంగా ఆహారభద్రత నియమాలు నిబంధనలు సూచనల మేరకు ఆహార పదార్థాలు వినియోగించాలని తెలిపారు. దుకాణ దారులు నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని తెలిపారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వినియోగించరాదని, అధిక ధరలకు విక్రయించరాదని తెలిపారు. ఆరోగ్యంతో ఉన్న వారి చేతనే ఆహారం వండించడం, వడ్డించేలా చూడాలని తెలిపారు. ఆహార పదార్థాలతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్త బుట్టలను వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార నాణ్యత ప్రమాణాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులచే ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటేశ్వర్ రావు, జగదీష్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## సురేష్ మృతదేహానికి అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు



కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త
జీవనోపాధి కోసం దుబాయ్ దేశం వెళ్లి అక్కడ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన గుండ్లమడుగు వాసి సురేష్ మృతదేహానికి బుధవారం గ్రామంలో కుటుంబీకులు, గ్రామస్తులు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలను నిర్వహించారు. సిఎం చంద్రబాబునాయుడు చొరవతో మంగళవారం అర్ధరాత్రి గుండ్లమడుగుకు సురేష్ మృతదేహం చేరుకున్న విషయం విదితమే. సురేష్ మృతదేహాన్ని చూసి కుటుంబీకులు కన్నీటపర్యంతమయ్యారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేంద్రన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కన్నులపండువగా ముత్యాలమ్మ జాతర సంబరాలు

### ఆకట్టుకున్న పోతురాజు ముగ్గు



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 8 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో జాతర సంబరాలు కన్నులపండువగా నిర్వహిస్తున్నారు.. ఆదివారం రాత్రి చాటింపులతో ప్రారంభమైన జాతర సంబరాలు బుధవారం ఉదయం నుంచి ముత్యాలమ్మగుడివీధిలో నివాశస్థులు మొక్కలు తీర్చుకొనుటకు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇళ్ళ వద్ద అంబలి ప్రసాదాల్ని పంపిని చేశారు. ఆలయాన్ని చక్కగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో కన్నులు మిరుమిట్లు గొల్లునట్లు ముస్తాబులు చేశారు. బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పోతురాజుముగ్గు వేసి చక్కగా కొలుపు గంగపెట్టిపూజ, జరిపించారు. అనంతరం రేణుకాదేవి ముగ్గు, కొలుపు రాత్రి అమ్మవారికి మహాకుంభ నైవేద్యం, అలంకరణ చేపట్టారు. ఆలయ ఇఓ బికె వవెంకటేశులు ఆదేశాలతో ఉత్సవాల్ని కన్నుల పండువగా నిర్వహించటంలో ఆలయపర్యవేక్షకులు లక్ష్మయ్య, ఎఇఎ హేమామాలిని, సూపరింటెండెంట్ రవి, దుర్గా ప్రసాద్‌లు చక్కటి ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాల్లో భక్తుల సందడి కనబడుతుంది. జాతర సందర్భంగా ముత్యాలమ్మగుడి వీధిని పెండ్లి మండపం నుంచి నిత్య కళ్యాణం పచ్చ తోరణంలా ముస్తాబు చేసారు. ఓ వైపు అరటి చెట్ల కనువిందు మరోవైపు మామిడి తోరణాలు, వీధంతా పసుపు నీళ్ళతో శుభ్రం చేయటం కనబడింది. జాతరకు సంబంధించి ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ వారి సహచరులతో పర్యవేక్షిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేస్తున్న ముగ్గులు, అలంకరణలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.

## నాడు జన్మభూమి స్ఫూర్తితో చెరువుల ఆధునీకరణ

## నేడు జలసంరక్షణ పేరుతో నీటివనరుల పునరుద్ధరణ



1998లో జన్మభూమిలో బాగుపడిన తొండమనాడు చెరువు

**పరిపాలనలో ఎప్పుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నా రైతు సంక్షేమానికి పెద్దపీట వేసే వారు.ఈ నేపథ్యంలో 1998లో ఉమ్మడి ఆంధ్రరాష్ట్రానికి ముఖ్యమంత్రిగానూ, శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్నపుడు రైతుల భాగస్వామ్యంతో చెరువుల ఆధునీకరణకు 'జన్మభూమి' కార్యక్రమాలను రూపొందించారు. నాడు మంత్రిగా ఉన్న గోపాలకృష్ణారెడ్డి హయాంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకృష్ణదేవరాయల హయాంలో నిర్మించిన చెరువుల ఆధునీకరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నేడు మళ్ళీ రైతు సంక్షేమానికి సాగుకు నీటి కోసం నీటి వనరుల సంరక్షణకు 'జలసంరక్షణ' కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేసారు.అది కూడా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జలగోపాలకృష్ణారెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డితో శ్రీకారం చుట్టారు'**

శ్రీకాళహస్తి-(ప్రభాతవార్త)
శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యవసాయక ప్రాధాన్యత కల్గిన ప్రాంతం, ఈ ప్రాంతాల్లో శాశ్వత నీటి వనరుల్లేదు. అయితే ఈ నియోజకవర్గంలో నాడు పరిపాలించిన రాజులు సుమారు 450 చెరువులను తవ్వించారు. వీటిలో చాలా చెరువులు చైన్ లింక్.అంటే ఒక చెరువు నిండితే మరో చెరువుకు నీరు అందుతుంది. జన్మభూమి కార్యక్రమాలను నాడు 1998లో శ్రీకారం చుట్టినపుడు తొండమనాడు చెరువులో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.అప్పటిలో ఇక్కడ చంద్రబాబు నాయుడుచే కార్యక్రమాలను ఏర్పాటు చేసి శ్రీకారం చుట్టారు. అక్కడ నుంచి శ్రీకాళహస్తి మున్సిపాలిటిలోని చెంబేడు కాలువ ఆధునీకరణకు చంద్రబాబునాయుడు హాజరై పథకం లక్ష్యాలను రైతులకు, ప్రజలకు వివరించారు. అప్పటిలో చెరువు కట్టలను ఆధునీకరించారు.అలా అప్పటిలో చెరువులకు మహార్ధశ కల్గింది.

**నేడు జలసంరక్షణ:**

చంద్రబాబునాయుడు పరిపాలనలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు.ఈ నేపథ్యంలో వ్యవసాయానికి జలసంరక్షణ పేరుతో నీటి కుంటలు, కాలువలు, చెరువుల ఆధునీకరణకు శ్రీకారం చుట్టారు.ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి మండలం సూరావారి పల్లెలో ప్రారంభోత్సవం ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ హాజరై రైతుల్ని చైతన్య పరచారు.శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సుమారు మైనర్,మీడియం ఇరిగేషన్‌కు సంబంధించిన చెరువులున్నాయి. అయితే చైన్ లింక్ చెరువుల ప్రారంభం తొండమనాడు చెరువు నుంచి ప్రారంభం అవుతుంది. ఇది పేరుకు మైనర్‌ఇరిగేషన్‌లో ఉంది కానీ ఈ చెరువు చుట్టుపక్కల ప్రాంతాలను సస్యాశ్యామలం చేయటమే కాకుండా చుట్టపక్కల ఉన్నచెర్లోపల్లి, ఊరందూరు, కమ్మకొత్తూరు, నాయుడు చెరువు, అక్కుర్తి చెరువులకు వేలాది ఎకరాలకు సాగునీరందిస్తుంది. అలాంటి ప్రాధాన్యత కల్గిన చెరువు 1998 జన్మభూమి తరువాత నిధులకు నోచుకోలేదు. ఐదేళ్ళ వైకాపా పాలనలో చెరువుల మీద కాణి పెట్టలేదు. ప్రస్తుతం 'జలసంరక్షణ' ఓ సువర్ణావకాశం అని చెప్పవచ్చు. నియోజకవర్గంలోని చెరువులకు మహర్ధశ కల్పించవచ్చు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేయాలని శాసనసభ్యుడు సుదీర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులకు దిశెదెశ నిర్దేశం చేసారు.ఇక చెరువుల నుంచి వచ్చే పంట కాలువలు కొన్ని చోట్ల ఆక్రమణలు మరి కొన్ని చోట్ల సిల్టునిండి ఉంది. ఇంకొన్ని చోట్లపిచ్చిమొక్కలతో నిండి ఉన్నాయి.ఇలాంటి పనులకు ఇదో మహదవకాశం అని చెప్పవచ్చు.చెరువులతోనే వ్యవసాయం సాగే నియోజకవర్గంలో 'జలసంరక్షణ' ఓ సదవకాశం అని చెప్పవచ్చు. నాడు గోపాలకృష్ణా రెడ్డి అందివచ్చిన అవకాశంతో చెరువులకు మహర్ధశ కల్పించారు. మరి నేడు సుధీర్‌రెడ్డి ఏం చేస్తారో? వేచి చూడాలి.

## పాలిసెట్‌కు దరఖాస్తుల వెల్లువ

### 87 వేల సీట్లకు 1.52 లక్షల దరఖాస్తులు.. పోటీ తీవ్రం

### నేడు చివరి రోజుకు చేరిన పాలిసెట్ గడువు

### జిల్లా కోఆర్డినేటర్ డా. ద్వారకనాథ్ రెడ్డి వెల్లడి



తిరుపతి విద్య ఏప్రిల్ 8 ప్రభాత వార్త
పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆసక్తి ఈసారి పాలిసెట్2026 దరఖాస్తుల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై ద్వారకనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో సుమారు 87 వేల సీట్లు మాత్రమే ఉన్నప్పటికీ, ఇప్పటివరకు దాదాపు 1.52 లక్షల దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి దరఖాస్తుల సంఖ్య గణనీయంగా పెరగడం, డిప్లొమో కోర్సుల ప్రాముఖ్యతపై అవగాహన పెరిగిన సంకేతమని ఆయన పేర్కొన్నారు. తక్కువ కాలంలోనే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలు పొందడంలో పాలిటెక్నిక్ విద్య కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. చిన్న వయస్సులోనే ఉద్యోగ అవకాశాలను సాధించి, ఆ తర్వాత ఉన్నత విద్యలోకి ప్రవేశించే అవకాశాన్ని డిప్లొమో కోర్సులు కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు పాలిసెట్‌పై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారని చెప్పారు. ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకోవాలని, ఎందుకంటే గురువారంతో దరఖాస్తుల గడువు ముగియనున్నదని ఆయన సూచించారు. అలాగే ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ కొనసాగుతోందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

**ఉచిత పాలిసెట్ కోచింగ్‌కు విద్యార్థుల భారీ స్పందన**

ఉచిత కోచింగ్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 500 మంది విద్యార్థులు ఈ శిక్షణ తరగతులకు హాజరవుతూ అవకాశాన్ని వినియోగించు కుంటున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి బాలురు, బాలికలకు వేర్వేరు బ్యాచ్‌లుగా నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. కోచింగ్‌తో పాటు అవసరమైన అధ్యయన సామగ్రిని ఉచితంగా అందజేస్తూ విద్యార్థుల సిద్ధతను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మరింత మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల యాజమాన్యం సూచించింది.

# త్రాగునీటి సమస్య పరిష్కారంకు చర్యలు: ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి

## రూ. 2 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

వి.కోట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:



వి.కోట మండలంలో శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు.మండలంలోని గోనుమాకులపల్లె,కృష్ణాపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలలో ఆయన పర్యటించి ఇప్పటిదాకా రూ. 2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.అందులో భాగంగా దానమయ్యగారిపల్లి టోల్ గేట్ వద్ద జనసైనికులు భారీ గజమాలతో ఆయన్ను సత్కరించి అపూర్వ స్వాగతం తెలియజేశారు.అక్కడినుంచి తొలుత గోనుమాకులపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.గోనుమాకుల పల్లె నుంచి ఎస్.బండపల్లి వరకు 31 లక్షలతో మరియు రూ.15 లక్షలతో గ్రామంలో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం మరిమాకులపల్లిలో రూ.15 లక్షలతోనూ, గోనుమాకులపల్లి నుంచి తెట్టు వరకు 58 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన ప్రారంభించారు. ఇక అదే పంచాయతీలోని నామాల వంకలో 12 లక్షల తోనూ,చిన్న శ్యామలో రూ. 26.60 లక్షలతో,నాగిరెడ్డి పల్లిలో 16 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఆయన నాయకులతో కలిసి ప్రారంభించారు.మధ్యాహ్నం కృష్ణాపురం పంచాయతీలోని వెంకటేపల్లిలో 10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును, మోట్లపల్లిలో 26 లక్షల తోనూ,కృష్ణాపురంలో 10 లక్షల తోనూ,మద్ధిరాలలో 8 లక్షలు, ఎడగురికి నందు 13 లక్షలు, దానమయ్య గారి పల్లెలో 8 లక్షలతో ఏర్పాటుచేసిన సిసి రోడ్లకు శిలాఫలకాలను ఆయన ప్రారంభించారు.ఇలా రెండు పంచాయతీల పరిధిలో సుమారు రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లో సమస్యలపై ఆరా తీస్తూ గోనుమాకులపల్లి, కృష్ణాపురం పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.గోనుమాకులపల్లె పాఠశాలలో ఆర్వో ప్లాంట్ తో పాటు,గేటు ఏర్పాటు చేయించాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరి వినతిపత్రం అందజేశారు.బండపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘ సమావేశాలకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయించాలని మహిళలు ఆయనకు విజ్ఞప్తి చేశారు.తెట్టు గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేయించాలని, దెబ్బతిన్న డ్రైనేజీని బాగు చేయించాలని గ్రామస్తులు కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆయన ఆదేశించారు.తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన గ్రామస్తులకు వివరించారు.దీంతో ప్రతి ఇంటికి శుద్ధ జలాలతో పాటు గ్రామ గ్రామానికి రోడ్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని వివరించారు.ఇంకా గ్రామాల్లో ఏదైనా సమస్యలు ఉంటే తప్పక వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న,మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు,రాష్ట్ర వేర్హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్ర నాయుడు,రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర,మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడు,ధీరజ్,శబరీష్, జనార్దన్ రెడ్డి,సతీష్,అమర్, కోదండ రెడ్డి లతో పాటు గోనుమాకులపల్లె పంచాయితీ నాయకులు,కృష్ణాపురం పంచాయతీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాలసిబ్బంది అందుబాటులో ఉండాలి

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త




రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని పెద్ద గోపనపల్లి గ్రామంలో రైతులకు కలసి అన్నదాత సుఖీభవ పథకంలో నగదు జమ అయిందా లేదా అని నేరుగా అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులకు ఎరువులను సకాలంలో అందిస్తున్నారా రైతు సేవా కేంద్ర సిబ్బంది పనితీరు ఎలా ఉంది అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుసేవా కేంద్రాల సిబ్బంది తమ పరిధిలోని అన్ని గ్రామాలకు వెళ్లి రైతులకు కలసి వారికి అవసరమైన ఎరువులు, ఇతర అవసరాలు గుర్తించి పై అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. వారంలో రెండు రోజులు సాయంత్రం వేళల్లో తాను గ్రామాల్లో వచ్చి రైతులను నేరుగా కలుస్తానని పేర్కొన్నారు. ఆర్ఎస్‌కె సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులు ఏదేని ఇబ్బందులు ఉంటే 8331057784, 8106554554 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సంబంధించి 18 వార్డుకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం నాయకులు లబ్దిదారులకు తెదేపా కార్యాలయంలో పంపిణీ చేశారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రజల ఆరోగ్యం పట్ల చొరవ చూపుతున్నారన్నారు. లబ్దిదారులు మాట్లాడుతూ సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్ జాకీర్, వార్డు అధ్యక్షుడు ముజీబ్, ప్రధాన కార్యదర్శి నబీఉల్లా, బూత్ ఇన్‌చార్జ్‌లు ఉమేర్‌ఖాన్, ఖాసిం, జాలు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారంకు తక్షణ చర్యలు

శాంతిపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే పరిష్కారంకు చర్యలు చేపడు తున్నట్లు ఎంపిడిఒ పిఆర్ కుమార్ తెలిపారు. బుధవారం శివరాంపురం పంచాయతీ గట్టూరు, శాంతంపల్లి, ఒడ్డువంక, రాళ్లబూదుగూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందుగానే గ్రామాల్లో ఉన్న బోరు మోటార్ల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతోందన్నారు. బోర్లలో నీరు తక్కువ కావడం, విద్యుత్ అంతరాయం, సరిపడా నీరు రాకపోవడం వంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. తాగునీటి బోర్లనుంచి పొలాలకు కొందరు ఏర్పాటుచేసుకున్న డ్రిప్‌లను తొలగించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్ నెలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా చెత్తను ఇ - ఆటోలకు అందించాలన్నారు. ఏదేని సమస్యలు ఉంటే 9491071394నెంబరుకు సమాచారం ఇవ్వాలని

## ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ఉద్యోగుల నిరసన కార్యక్రమం

పూతలపట్టు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు పి. కొత్తకోటలోని సిహెచ్సి కేంద్రంలో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రాధ, ప్రెసిడెంట్ లీలావతి (స్టాఫ్ నర్స్), కార్యదర్శి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే వైద్యాధికారి డాక్టర్ బి. కోమల, డాక్టర్ సి. కుమార్ రాజా, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, డాక్టర్ సోమేశ్వర్, డాక్టర్ అరవింద్ తదితర వైద్యులు ఈ నిరసనకు మద్దతు తెలిపారు. వైద్య ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం త్వరితగతిన స్పందించాలని కోరుతూ, అవసరమైతే భవిష్యత్తులో తీవ్ర నిరసనలకు దిగుతామని హెచ్చరించారు.

## ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు.

చిత్తూరు హెల్త్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త;



సినీ నటుడు అల్లు అర్జున్ 44వ జన్మదిన వేడుకలను చిత్తూరు నగరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎస్ఆర్ సర్కిల్ లో జిల్లా అల్లు అర్జున్ అభిమాన సంఘం అధ్యక్షులు కుట్టీ రాయల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మండీ సుధాకర్ రెడ్డి, జిల్లా ప్రతినిధి శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుట్టీ రాయల్ మాట్లాడుతూ ... ప్రతి ఏటా తమ అభిమాన నటుడు అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు వీలుగా తమ అభిమాన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి బన్నీ అభిమానులందరూ తమ రక్తాన్ని దానం చేశారని వెల్లడించారు. తాము సైతం తమ అభిమాన నటుడు అల్లు అర్జున్ బాటలో పయనిస్తూ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న బాలికల పాఠశాలలు, కళాశాలలు, బాలికల వసతి గృహాల్లోని బాలికలకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా ముందస్తు జాగ్రత్తగా 10 నుంచి 20 సంవత్సరాల లోపు ఉన్న తమ ఆడ పిల్లలకు హెచ్పీవీ వ్యాక్సిన్ ను వేయించాలని ఆయన సూచించారు. కాగా ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ అభిమానసంఘంనాయకులుఅబ్దుల్లా,శివ,ఐకాన్‌సురేష్, చంటి సునీల్, లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం మంచు.. ఆపై భగ్గుమంటున్న భానుడు

శాంతిపురం, ఏప్రిల్ 8ప్రభాతవార్త



మండువేసవిలో సైతం ఉదయం పూట మంచు కురుస్తూ ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. శాంతిపురంలో బుధవారం ఉదయం 8గంటలైనా మంచు తెరలు తొలగలేదు. అనంతరం భానుడు భగభగలాడాడు. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు సుమారు నలభై డిగ్రీల దాకా చేరుతున్నాయి. దీంతో జనం ఈ ప్రకృతి వింతకు ఆశ్చర్య చకితులవుతున్నారు.

# కూటమి పార్టీల నాయకులు చెప్పిన వారికే సదరం సర్టిఫికెట్ల జారీ

చిత్తూరు హెల్త్ ,ఏప్రిల్ 8, ప్రభాతవార్త;



కూటమి పార్టీల నాయకులు చెప్పిన వారికే సదరం సర్టిఫికెట్ల జారీలో ప్రాధాన్యత ఇస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు విభాగం రాష్ట్ర అధ్యక్షులు పులిపాటి దుర్గారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం స్థానిక కొంగారెడ్డిపల్లెలోని చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్ అధ్యక్షతన ఉమ్మడి చిత్తూరు జిల్లా దివ్యాంగుల విభాగం సంస్థాగత నిర్మాణం, విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఉద్దేశించి దుర్గారెడ్డి మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరుతో లక్షలాది మంది దివ్యాంగులను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పెద్ద ఎత్తున కొత్తగా పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చి నేడు అందుకు విరుద్ధంగా ఉన్న పెన్షన్లనే రద్దు చేస్తూ దివ్యాంగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. తమకు అనుకూలంగా ఉన్న వారికే కూటమి పార్టీల నాయకులు సదరం సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నారని ఆరోపించారు.

గత ఏడాది డిసెంబర్ 3 వ తేదీన జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఇంద్రధనస్సు పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగులకు 7 వరాలను ఇచ్చారని, వాటిలో ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన 6 వరాల అమలు మాటేమిటని ప్రశ్నించారు. తూతు మంత్రంగా దివ్యాంగ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలుపరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బస్సుల్లో దివ్యాంగులకు సీట్ల కోటాను పెంచడంలో విఫలమైందని మండిపడ్డారు.

ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జోన్ 4 అధ్యక్షులు ఆవుల నాగేంద్ర, న్యాయ విభాగం జిల్లా ప్రతినిధి దివాకర్ రెడ్డితో పాటు పెద్ద ఎత్తున దివ్యాంగులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

రామకుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మన్ జవహర్‌ను రామకుప్పం మండల ఎంఆర్పిఎస్ నేతలు బుధవారం చిత్తూరులో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ కేసుల నమోదు విచారణలో ఆలస్యం అవుతుందని, ఎస్సీ ఎస్టీ హాస్టల్లో శుభ్రత నిర్వహణ పై సక్రమంగా లేదని తెలిపారు. బందార్లపల్లి పంచాయతీ గడ్డూరులో భూ సమస్యలపై వివరించారు. ఎస్సీ ఎస్టీ కేసులను వేగవంతంగా పరిష్కరించి, మానిటరింగ్ సమావేశాలు నిర్వహించాలని కోరారు. దీంతో ఆయన స్పందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, కో ఇంచార్జి వెంకటేష్, నేతలు గోవిందప్ప, జయప్ప, సుబ్రహ్మణ్యం, అంజి, కనకమ్మ, సుగుణమ్మ ,ఆదెమ్మ, శ్యామలమ్మ ,లక్ష్మమ్మ, కుప్పం నియోజకవర్గ ఎంఆర్పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రామకుప్పం మెయిన్ రోడ్డు విస్తరణ జరిగేనా?

రామకుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని మెయిన్ రోడ్ విస్తరణ ఎప్పుడు జరుగుతుందో మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. దశాబ్దాల కాలం నుంచి వాహనదారులు, పాదాచారులు ట్రాఫిక్ ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్న ఇప్పటికీ మోక్షం కనిపించడం లేదు. గత ఆరు నెలల క్రితం కుప్పం నియోజకవర్గ కడ పిడి ఆదేశాలతో రోడ్డు విస్తరణకు ఇరువైపుల 50 అడుగులతో రెవిన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి మార్కింగ్ వేయించారు. స్థానిక సర్పంచుల ఎన్నికలు సమీపిస్తుండడంతో రోడ్డు విస్తరణ ఆగిపోయిందని ప్రజల చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా రోడ్డు విస్తరణ జరిగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ఒంటరి ఏనుగు సంచారం..

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

రామకుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

మండలంలోని ననియాల అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తుందని అటవీ అధికారులు తెలిపారు. రాత్రి సమయాల్లో రైతులు వంట పొలాల వద్దకు వెళ్ళవద్దని సూచించారు. పంట పొలాల వద్ద విద్యుత్ తీగలు ఏనుగుకు తగిలినంత ఎత్తులో ఉంటే వాటిని తొలగించాలన్నారు. జీడిమాకులపల్లి, పాలరేవు గడ్డ, రామాపురం తాండ, చెలిమిచేను ప్రాంతంలోని రైతులు అప్రమత్తంగా ఉండి ఏనుగు సంచరిస్తే 9440563537,6301667521 ఫోన్ నెంబర్లకు సమాచారం తెలపాలన్నారు.

## ఆనగల్లులో పశువైద్యశిబిరం

చిత్తూరురూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:



చిత్తూరురూరల్ మండలం ఆనగల్లు నందు ప్రభుత్వ వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ, చిత్తూరు వ్యవసాయ మార్కెట్‌కమిటటీ సంయుక్త ఆధ్వర్యంలో పశువైద్యశిబిరంను ఏర్పాటుచేసారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తండ్రి జిజెఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టరు గురజాల చెన్నకేశవులు, చిత్తూరు ఏఎంసి చైర్మెన్ ఝూన్సీ వెంకటేష్‌యాదవ్‌తో కలసి పాడి రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేసారు. అలాగే పశువుల పోషణ, ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు.ఏఎంసి డైరెక్టర్లు రాణి, అనురాధ, గంగిరెడ్డి, అంజలి, నాగరాజు. టిడిపి నాయకులు మోహన్‌రాజ్,శశికర్‌బాబు, మేషక్, స్థానిక తెలుగుదేశం, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఐ గోపి ఆధ్వర్యంలో విద్యార్ధులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం

పూతలపట్టు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త



పూతలపట్టు మండలంలోని పి కొత్తకోట పరిధిలో ఉన్న వేము ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు డ్రగ్స్ పై సీఐ గోపి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలు వినియోగం వల్ల కలిగే అనర్ధాలు పై, ఎన్‌డిపిఎ చట్టం గురించి అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తాయని తెలిపారు. ఇది తల్లిదండ్రులకు కాకుండా మాదవ ద్రవ్యాలు వినియోగించిన వారికి మానసికంగా, ఆర్థికంగా ఎంతో నష్టాన్ని కలిగిస్తుందని కుటుంబ సభ్యులకు తీవ్ర ఆవేదన కల్పిగిస్తుందని తెలిపారు. అందువల్ల విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఈగల్ స్క్వాడ్ ఇన్చార్జ్ ఆఫీసర్ జి.ప్రసాద్, చిత్తూరు టౌన్ డ్రగ్ ఇన్స్పెక్టర్ కీర్తన, ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ గిరి, 500 మంది విద్యార్థులు, కాలేజ్ యాజమాన్యం పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం పట్ల సిఎం ప్రత్యేక చొరవ

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చొరవ చూపుతున్నారని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, ప్రధాన కార్యదర్శి నబీ ఉల్లా, కొత్తపేట యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట 11వ క్లస్టర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు సుబ్రమణి, సుభాన్‌బాబు, భాస్కర్, లోకేష్, మణి, మోహన్ పాల్గొన్నారు.

# ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగుల నిరసన

**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, వైద్య విద్య ఆరోగ్యశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ దశల వారి పోరాటాలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏటుకూరి గిరిబాబు మాట్లాడుతూ ఈ నెల 8, 9వ తేది వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వడం, 10, 11వ తేది వరకు ఉదయం 9 గంటల నుండి 10 గంటల వరకు, నిరసన కార్యక్రమాలు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రధాన వైద్యశాలలు, ఏరియా హాస్పిటల్, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఈఎస్ఐ ఆసుపత్రి నందు జరుగు ఆందోళన నిరసన కార్యక్రమాల్లో వైద్య ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ వైద్య రంగములలోని ఉద్యోగుల పక్షాన గత 73 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు చేస్తూ ఏపీ విపి డి ఎస్ హెచ్ నందు కాంట్రాక్టు ఉద్యోగులను 1999లో పోరాటాలు చేసి రెగ్యులర్ చేసారు. సమస్యలు పరిష్కారానికి పోరాటాలు చేసి కారుణ్య నియామకాలు పెన్షనర్లకు ఉద్యోగులకు సంబంధించిన అనేక జీవోలు, సాధించిందని మన సంఘమే దీనికి వేరే ఏ ఇతర సంఘం సాటి రాదు కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డి ఎస్ హెచ్ బదులు జాయిన్ మీటింగులు ఏర్పాటు చేసి అనేక సమస్యలను పరిష్కరించడం జరిగినది. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైద్య సిబ్బంది, పరిపాలన సిబ్బంది, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు నాయుడు, తిరుపతి జిల్లా సెక్రెటరీ కేసి సుబ్రహ్మణ్యం, తిరుపతి జిల్లా అధ్యక్షులు వీర కిరణ్, ఆంధ్రప్రదేశ్ ఎన్జీవో నాయకులు ముని కేశవులు, ఎం శ్రీనివాసులు, రేణుక, శాంత కుమార్, నాగరాజు, వాణి, రాజ్యలక్ష్మి, ఆస్థాన బేగం, దేవేంద్ర వర్మ, వినోద్, లోకేష్ నాయుడు తదుతరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మంచినీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే

**పుత్తూరు (నగరి), ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**



నగరి మునిసిపాలిటీ పరిధిలోని 25, 26 వార్డుల్లో నాలుగు నెలలుగా నెలకొన్న మంచినీటి సమస్యను ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పరిష్కరించారు. రెండు వార్డుల పరిధిలోని తొమ్మిది వీధులకు సంబంధించిన బోరులో నీరు అడుగంటిపోయింది. దాంతో విద్యుత్ మోటారు కూడా మరమ్మతుకు గురైంది. నాలుగు నెలలుగా స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇతర వార్డుల్లో వున్న బోర్ల వద్దకు వెళ్లి మంచినీళ్లు తీసుకొచ్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే అడుగంటిన బోరును మరింత డ్రిల్ చేయడానికి తగినన్ని నిధులు లేనందున సమస్యను పరిష్కరించలేకపోయారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దాంతో ఆయన వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దాంతో రెండు రోజులుగా 25వ వార్డులోని బోరు, విద్యుత్ మోటారును రిపేర్ చేసి బుధవారం నుంచి మంచినీటి సరఫరా ప్రారంభించారు. వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నందుకు స్థానికులు ఎమ్మెల్యే భానుప్రకాశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎం సి ఎ ఫలితాల్లో గేట్ విద్యార్థుల సత్తా

**తిరుపతి విద్య, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**




శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఎం సి ఎ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో తిరుపతికి చెందిన గేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ సైన్స్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధిస్తూ పలువురు విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. ఈ ఫలితాల్లో సిద్ధుశ్రావంతి 8.58 గ్రేడ్ పాయింట్లతో ముందంజలో నిలవగా, కుసుమకళ్యాణి, వర్షా 8.35, తేజ 8.34, వసంత్ కుమార్ 8.29, చిన్నారి,మాధవి 8.26 గ్రేడ్ పాయింట్లతో ప్రతిభ చాటుకున్నారు.విద్యార్థుల ఈ విజయాన్ని అభినందిస్తూ కళాశాల చైర్మన్ డా. తమ్మమనేని వెంకటేశ్వర్లు, చైర్పర్సన్ పలడుగు విజయ, ప్రిన్సిపల్ ప్రణిత్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల కృషి, పట్టుదలతో పాటు అధ్యాపకుల సమర్థ మార్గనిర్దేశం ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షి స్తూ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సహ విద్యార్థులు విజేతలను అభినందించారు.

## ఎల్లయ్యను హత్య చేసిన దుండగులను శిక్షించండి

**– బార్ అసోసియేషన్ సెక్రటరీ రాజా**

**సత్యవేడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**



అన్నమయ్య జిల్లా కేవీ పల్లి మండలం వడ్డిపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ పూజారి ఎల్లయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సత్యవేడు న్యావాదుల బార్ అసోసియేషన్ సెక్రటరీ రాజా కోరారు. న్యాయవాది ఎల్లయ్య ఇంటిపై దాడిచేసి హత్య చేసిన ఘటనను నిరసిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో బుధవారం విధులను బహిష్కరించి కోర్టు వెలుపల బార్ అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజా మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాను రాను న్యాయవాదులకు రక్షణ కరువయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. హత్యకు గురైన అ న్యాయవాది ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కుబేరన్, వెంకటేశ్వరులు, లోకేష్, మునిశేఖర్, శివానందం, బాలకృష్ణారెడ్డి, వెంకటేష్, శ్రావణ్, విగ్నేష్, దినకరన్, కిషోర్, అజిత్, అమోస్ పాల్గొన్నారు.

## తెలుగు తల్లి ముద్దుబిడ్డ

**శంకరంబాడికి ఘన నివాళి**

**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్త:**



రాయలసీమ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే గొప్ప కవి, మా తెలుగు తల్లి మల్లెపూదండ" గీతాన్ని అందించిన శంకరంబాడి సుందరాచార్యుల వర్ధంతి రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక లక్ష్మీ మ్మపురం కూడలిలోని శంకరంబాడి సుందరాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేసి కళాకారులు, సాహితీ ప్రియులు భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి శంకరంబాడి చేసిన సేవలు అమూల్యమని, ఆయన రచనలు తెలుగు భాష యొక్క మాధుర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయని పేర్కొన్నారు. మా తెలుగు తల్లి మల్లెపూదండ" గీతం ద్వారా తెలుగు తల్లి మహిమాన్వి తత్వాన్ని చాటిన మహాకవి శంకరంబాడి సుందరాచార్యులు తెలుగు జాతికి చిరస్మరణీయులని కొనియా డారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కార్యదర్శి కే.ఎన్. రాజా, రంగస్థలి ప్రతినిధులు, పురోహితుడు సురేష్ స్వామి, మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి, ఎల్. కృష్ణయ్య, చిత్రపు హనుమంతరావు, మణికంఠ, వాసు, మల్లారపు రవి ప్రసాద్, లోక ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ గణితశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**కరపత్రాల ఆవిష్కరణ**

**తిరుపతి విద్య, ఏప్రిల్ 8 ప్రభాత వార్త**




శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాల యం గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఈ ఏడాది జూలై 18న నిర్వహించనున్నట్లు ప్రక టించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం వర్సిటీ వీసీ నం సింగరావు, రెక్టర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆవిష్కరించారు.విభాగాధిపతి ప్రొఫెసర్ జయసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ఎస్వీయూలో పీజీ మాథమేటిక్స్, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పూర్వ విద్యార్థులతో అనుబంధాన్ని బలోపేతం చేసుకోవడమే ఈ సమ్మేళనం లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆచార్యులు సుగుణమ్మ, భారతి, సుధాకరయ్యతో పాటు అకడమిక్ కన్సల్టెంట్లు పాల్గొన్నారు.

## నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన మాజీమంత్రి రోజా

**విజయపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**



విజయపురం మండలం సామిరెడ్డి కండ్రిగ గ్రామంలో వైసీపీ నియోజ కవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు మురళీ రెడ్డి మామ నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం సామిరెడ్డి కండ్రిగలో ఆయన కర్మకిర్య కార్యక్రమంలో మాజీమంత్రి రోజా పాల్గొని చిత్రప టానికి పూలమాల వేసి నివాళుల ర్పించి కుటుంబ సభ్యులకు మనోధై ర్యాన్నితెలియజేశారు. స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

**సత్యవేడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**



సత్యవేడు మండలం రాజుగుంటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు దాముయాదవ్ గుండెపోటుతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను అత్యవసరంగా సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధృవీకరించారు. ప్రజలతో మమేకమై, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన ఆయన మరణవార్త తెలిసిన వెంటనే గ్రామంలో సోకసంద్రం నెలకొంది. ఆయన మృతి పార్టీకి తీరని లోటని స్థానిక నాయకులు పేర్కొంటూ ఆయన సేవలను స్మరించుకున్నారు. సత్యవేడు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శంకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శివకుమార్, దాముయాదవ్ మృతిపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



## కష్ట కాలంలో తోడుగా కూటమి ప్రభుత్వం

**సత్యవేడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**

సత్యవేడు నియోజకవర్గంలో ఆపదలో ఉన్న వారికి అండగా ముఖ్యమంత్రిసహాయనిధి నుంచి రూ.10 లక్షల చెక్కును అందజేసినట్లు కూరపాటి శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నారాయణవనం మండలానికి చెందిన కస్తూరి వైద్యఖర్చుల కోసం కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.10 లక్షలు విలువైన చెక్కును నారాయణవనం టీడీపీ నాయకులతో కలసి సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి బుధవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి అందిస్తున్న ఈ సాయం బాధిత కుటుంబాలకు కొండంత అండనిస్తుందని పేర్కొన్నారు.

## 50 ఏళ్ల మైలురాయి..

**సీప్ స్టడీస్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు**

**తిరుపతి విద్య, ఏప్రిల్ 8 ప్రభాత వార్త**



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ సౌత్ ఈస్ట్ ఆసియన్-పసిఫిక్ స్టడీస్ విభాగం స్థాపనకు 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా బుధవారం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ టాటా నరసింగరావు, రెక్టర్ అప్పారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెంటర్ ఫర్ సౌత్ ఈస్ట్ ఆసియన్-పసిఫిక్ స్టడీస్ విభాగం క్రమంగా అభివృద్ధి చెందుతూ దేశంలో ప్రముఖ స్థానం సంపాదించడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యా, పరిశోధనా రంగాల్లో విభాగం చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు.సభాధ్యక్షులుగా వ్యవహరించిన విశ్రాంతి ఆచార్యులు ఆచార్య లక్ష్మణశెట్టి మాట్లాడుతూ చరిత్ర విభాగంలో భాగంగా ప్రారంభమైన ఇండో-చైనా అధ్యయన విభాగం, ఏరియా స్టడీస్ ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యేక విభాగంగా అభివృద్ధి చెందిన తీరు అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో విభాగ సంచాలకులు వూక రమేష్ బాబు, పూర్వ విద్యార్థిని భానుశ్రీ రెడ్డి, మాజీ సంచాలకులు ఆచార్య రాజారెడ్డి, మునిరత్నంరెడ్డి, జయచంద్రారెడ్డి, ఆచార్యులు విజయ్ కుమార్ రెడ్డి, ప్రయాగ, పద్మజ, తిమ్మప్పతో పాటు పరిశోధక విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉంది

**టాటా ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన పరీక్షలు**

**కేవీబీ పురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**




కేవీబీపురం మండల పరిధిలోని కావనూరు ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో క్యాన్సర్ వ్యాధిపై అపోహలు, అనుమానాలు, ఎదుర్కొనే ఇబ్బందులు తదితర అంశాలపై ప్రజలకు శ్రీ వెంకటేశ్వర క్యాన్సన్ ఇన్‌స్టిట్యూట్, టాటా ట్రస్టు వారు సంయుక్తంగా అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి నోటిలో, మహిళలకు రొమ్ము, గర్భాశయం ముఖ ద్వారం యుటరెస్‌లలో క్యాన్సర్ వ్యాధి తలెత్తితే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. వ్యాధి నివారణకు మొదటి మెట్టు, వ్యాధి నిర్ధారణ చేసుకోవడమే అని జిల్లా క్యాన్సర్ వ్యాధి చికిత్స నిపుణులు హేమంత్‌కుమార్ తెలిపారు. 25 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వయసు కలిగిన మహిళలు ఈ అవకాశం వినియోగించుకోవాలని వైద్యులు జగదీష్ పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్యబాబు, రెడ్డికుమారి, స్టాఫ్ నర్సు మెహతాజ్, కావనూరు పీహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవసరమైన చోట తాగునీరు కేంద్రాలు ఏర్పాటు చేయాలి - జాల్‌రెడ్డి



**సత్యవేడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**

వేసవి తీవ్రత పెరుగుతున్న దృశ్య మండలంలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయా లని తిరుపతిజిల్లా సూళ్లూరుపేట డివిజనల్ అభివృద్ధి అధికారి జాల్‌రెడ్డి అధికారులను ఆదేశిం చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు అంశాలపై పరిపాలన అధికారి త్రివిక్రమరావుతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియాతో ఈ సారి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందు వల్ల దీనిపై ఆయా పంచాయతీల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలు ఉదయం పనులకు వెళ్లి 10.30 గంటలకు ఇళ్ళకు చేరుకోవాలన్నారు. ఈ మేరకు ఉపాధి అధికారులు పర్యవేక్షించాలన్నారు. జలధార పథకంలో నీటిని సంరక్షించడానికి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను ప్రకటించిందన్నారు. జూన్‌లో తొలకరి ప్రారంభం అవుతుంది కాబట్టి అన్ని శాఖల అధికారులు ప్లాంటేషన్‌పై కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తారన్నారు. దీనిపై టార్గెట్ కూడా తప్పని సరిగా ఉంటుందని ఆయన వివరించారు. తద్వారా 50 శాతం రాష్ట్రాన్ని గ్రీన్ కవరేజ్ కిందకు తేవాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. మండలంలో ఎక్కడ కూడా తాగునీటి కొరత లేకుండా ఆయా పంచాయతీ సెక్రటరీ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మండలంలో ప్రస్తుతం ఆర్‌డబ్ల్యుఎస్ పరిధిలో 172 బోర్లు ఉండగా ఇందులో మరమ్మతుకు గురైన 20 బోరు బావులను బాగు చేయించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. డిప్యూటేషన్స్ ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న పంచాయతీ సెక్రటరీ వెనక్కి పిలిపించడానికి తగు చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## జర్నలిస్టుల ఉచిత హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:**

తిరుపతి జిల్లాలోని అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యులు ఉచిత హెల్త్ క్యాంప్ సేవలను మరింత ఎక్కువమంది ఉపయోగించుకోవాలని డిఐపిఆర్ఓ పి.గురుస్వామిచెట్టి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అక్రెడిటేషన్ కలిగిన పాత్రికేయులకు ఈ నెల 07 నుండి 10 వ తేదీ వరకు అమర ఆసుపత్రి, కరకంబాడి వారి సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా రెండవరోజైన బుధవారం కూడా ఉచిత హెల్త్ క్యాంప్ ను నిర్వహించడం జరిగిందన్నారు.నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉచిత హెల్త్ క్యాంప్ లో మిగిలివున్న రెండు రోజులు అనగా గురువారం, శుక్రవారం లలో జిల్లాలోని అక్రెడిటెడ్ జర్నలిస్ట్ లు (ప్రస్తుతము మరియు గతంలో అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులు) వారి కుటుంబ సభ్యులు ఉచిత హెల్త్ క్యాంప్ లో మరింత ఎక్కువమంది పాల్గొని ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని తెలిపారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు దళారుల్ని రానీయొద్దు - కడ పి.డి. వికాస్ మర్మత్

**– ప్రజలను విచారించిన పి.డి.. దళారులు..రైటర్లు వస్తే అరెస్ట్ చేయండి !!**

**కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**



కుప్పంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు దళారుల్ని రానీయవద్దని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర మ్మత్ ఆదేశించారు. బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రజలతో మాట్లాడారు. ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా ఎంత అడుగుతున్నారని ఆరా తీశారు. పలువురితో మాట్లాడి వారి అభిప్రాయం తెలుసుకున్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణతో మాట్లాడారు. కార్యాలయం ఆవరణ వద్దకు దళారులు, డాక్యుమెంట్ రైటర్లు ఎవరూ రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎవరైనా వస్తే అలాంటి వారిని అరెస్ట్ చేయాలని పోలీసు అధికారుల్ని ఆదేశించారు. డాక్యుమెంట్ల రిజిస్టర్ కోసం వచ్చే ప్రజలకు కూర్చునేందుకు కనీస వసతులు, తాగునీటి వసతి కల్పించాలని రిజిస్ట్రార్‌కు ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్లు జరపాలని ఆదేశించారు.

## ఆర్టీఈ అడ్మిషన్లు 10తో ముగింపు

**అడ్మిషన్ నిరాకరిస్తే చర్యలు: డీఈఓ కేవీఎన్ కుమార్**

**తిరుపతి విద్య, ఏప్రిల్ 8 ప్రభాత వార్త**



పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 ఉచిత సీట్ల కింద నిర్వహిస్తున్న ఆర్టీఈ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 10తో ముగియనుందని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు.2026-27 విద్యాసంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా మంచి స్పందన లభించగా, మొదటి విడతలో 523 మందికి సీట్లు కేటాయించారు. వీరిలో 425 మంది ఇప్పటికే అడ్మిషన్లు పొందారు. గడువు లోపు చేరని వారి సీట్లు రద్దవుతాయని హెచ్చరించారు. రెండో విడత కేటాయింపులు ఈ నెల 12న జరగనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వడం పాఠశాలల బాధ్యత అని, నిరాకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమస్యలు ఉంటే ఎంఈఓ, డీఈఓ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.



## వేసవి క్రీడ శిక్షణలపై సమీక్షా సమావేశం

**తిరుపతి క్రీడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త**

వేసవి క్రీడా శిక్షణల పై తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ అధికారి ఎన్. శశిధర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ

# వైసిపి నాయకులు విడుదలపై హర్షం



పెళ్లకూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: మండలంలోని కలవకూరు వద్ద ఇసుక రీచ్‌లో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని వైసీపీ నాయకులు సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, ఎన్‌డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మండల వైసీపీ నాయకులతో కలిసి అడ్డుకున్న సంఘటనలో అక్కడున్న సిబ్బందిపై దౌర్జన్యం చేశారన్న కేసులో నెల్లూరు సబ్ జైల్లో ఉన్న వైసీపీ నాయకులు మంగళవారం విడుదలైయ్యారు. మండలంలో ఉన్న వైసిపి నాయకులు నెల్లూరు పొదలకూరు రోడ్‌లో ఉన్న వైసీపీ క్యాంప్ కార్యాలయం నందు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు సభ్యులు గురుమూర్తి, సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్యతో కలిసి వారికి స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. అనంతరం వైసిపి నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు భయపడవద్దని మన అధినేత జగన్మోహన్‌రెడ్డి మీకు ఎప్పుడు అండగా ఉంటాడని నియోజకవర్గంలో కిలివేటి సంజీవయ్యతో ఆధ్వర్యంలో మరింత ముమ్మరంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను అనునిత్యం ప్రజలకు తెలియజేస్తూ పోరాటాలు చేయాలని వైసిపి పార్టీ మీకు ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. వైసీపీ నాయకులు విడుదల అవ్వడం పట్ల మండల వైసీపీలో సంతోషంగా ఉన్న మండలంలో పెద్దదిక్కుగా ఉన్న పెద్దాయన కెవెస్ఆర్ విడుదల కాకపోవడంతో కార్యకర్తలు, నాయకులు, వైసీపీ సానుభూతిపరులు నిరాశగా ఉన్నారు.

## న్యాయవాదుల విధులు బహిష్కరణ



సూళ్లూరుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం విధులు బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అడ్వకేట్స్ యాక్ట్ ప్రకారం రక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పీలేరులో యువ న్యాయవాది పూజారి యల్లయ్యను దారుణంగా హత్య చేశారని, నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదులు ఐక్యతగా ఉండాలని, న్యాయవాదులపై ఎవరైనా దాడులు నిర్వహిస్తే చట్టపరంగా పోలీసులు చర్యలు తీసుకునే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పంట్రంగం లక్ష్మయ్య, కార్యదర్శి కె.ధర్మాప్రసాద్, ఉపాధ్యక్షులు నత్తం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రం



నాయుడుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని ఇలాంటి పరిస్థితుల్లో ప్రజల దాహార్తిని తీర్చే చలివెంద్రం ఏర్పాటు చేయడం శుభ పరిణామాలు అని సూళ్లూరుపేట ఆర్‌టిసి డిపో మేనేజర్ డి. కళా తెలిపారు. మంగళవారం నాడు స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో నైనప్పగారి నారాయణరావు జ్ఞాపకార్థం మజ్జిగ చలివెంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివెంద్రంను ఆర్‌టిసి డిపో మేనేజర్ డి.కళా, స్థానిక ప్రభుత్వ వైద్యులు అమర్నాథ్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం వందల మంది ప్రయాణికులు, ప్రజలు తిరిగే ఇలాంటి ప్రాంతంలో ఈ ఎండలకు తీవ్రంగా నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చే చలివెంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యన్ ఏవీ కుమార్, బాబీ, రవిరెడ్డి, పగడాల శివ ప్రదీప్, మాదిరి చిట్టిబాబు, నైనప్పగారి వేంకటేశ్వర్లు, ప్రసాద్, మనోబోలు కోటేశ్వరరావు, పెంచలయ్య, పసల చంద్ర, శ్రీనివాసులు, బి. వేణు, భాస్కర్ రాజు, తదితరాలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్‌పై విద్యార్థులకు అవగాహన



సూళ్లూరుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి దేవేంద్రరెడ్డి ఆదేశాలతో కమిషనర్ చిన్నయ్య స్వచ్ఛ సర్వేక్షణ్ ఆవశ్యకతను, తడి పొడి చెత్తను రోడ్లపై వేయకుండా, వాటిని విడివిడిగా డస్ట్‌బిన్‌లో వేయాలని విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి మన్నారుపోలూరులో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు రోడ్ సేఫ్టీ జాకెట్ పంపిణీ



నాయుడుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: పట్టణ జనసేన నాయకులు శంకు సురేష్ తల్లి అయిన శంకు రాధమ్మ 6వ వర్ధంతి సందర్భంగా శంకు సురేష్ మన్నారు పోలూరులో నిర్వహించిన పలు సేవా కార్యక్రమంలో పాల్గొన్న సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, నాయుడుపేట ఏ.ఎం.సి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, శంకు సురేష్ ఆధ్వర్యంలో ప్రస్తుత వేసవికాలం ఎండలు దృష్టిలో పెట్టుకొని మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. మునిసిపల్ కార్మికులకు రోడ్ సేఫ్టీ రేడియం జాకెట్స్ పంపిని కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు అట్ల కృష్ణా రావు, సాగి హరి, జీలగ భాస్కర్, రాజేష్, తీపలపూడి రమణ, బాలు శెట్టి, కళ్యాణ్, కుంపటి శ్రీను, వీర మహిళ పద్మజ, కామాక్షి, తదితర జన సైనికులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు శక్తి బస్సు పాస్‌ల మేళా



నాయుడుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త : నాయుడుపేట బస్టాండ్ నందు బస్సు పాస్ కౌంటర్ నందు సూళ్లూరుపేట డిపో మేనేజర్ డి.కళ ఆదేశాల మేరకు దివ్యాంగశక్తి బస్సు పాసులు మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బస్సు పాస్ ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ సభ్యుడు చంద్రశేఖర్ పాల్గొని అర్హులైన అందరికీ దివ్యాంగశక్తి బస్సు పాసులు ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యాంగుల శక్తి వారికి భరోసా విద్య, వైద్యం లేదా ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లే దివ్యాంగులకు రవాణా ఖర్చులు భారం కాకుండా ఈ పాస్ అండగా ఉంటుందన్నారు. తీవ్ర వైకల్యం ఉన్నవారికి తోడుగా వచ్చే సహాయకుడికి (తోడు) కూడా టికెట్ ధరలో రాయితీ లభిస్తుంది. శారీరక లోపం వారి గమ్యానికి అడ్డుకాకూడదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించారన్నారు. మన దివ్యాంగ సోదరుల ముఖంలో ఈరోజు కనిపిస్తున్న ఈ చిరునవ్వే.. ఈ పథకం విజయానికి సాక్ష్యమన్నారు. ఈ పథకానుకు అర్హులైన ప్రతి దివ్యాంగులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, వారు సహాయకులు పాల్గొన్నారు. వారికి నిర్వాహకులు మజ్జిగ ప్యాకెట్లు వాటర్ బాటిల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

## నాయుడుపేటకు చేరిన డ్రగ్స్ అవగాహన సైకిల్ ర్యాలీ



నాయుడుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: దండి మార్చ్ 2.0 ఆంధ్రప్రదేశ్ మిషన్‌లో భాగంగా సైకిల్ ర్యాలీకి సాదర స్వాగతం చెప్పిన నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు, పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఎస్పై బ్రహ్మా నాయుడు, ఆదిలక్ష్మి భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కలలు కన్నా స్వరాజ్య నిర్మాణ స్థాపనకై పోలీస్ శాఖ సమన్వయంతో దండి మార్చ్ 2.0 ఆంధ్రప్రదేశ్ మిషన్‌లో భాగంగా సైకిల్ యాత్రకు నాయుడుపేట పట్టణ సీఐ వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. నాయుడుపేట డిగ్రీ కాలేజీలో యువతకు అవగాహన సదస్సు నిర్వహించిన పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, విద్యార్థులు ర్యాలీతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మాదకద్రవ్యాల ప్రభావంతో చాలా దేశాల చిన్న భిన్నమయ్యాయని యువత మత్తుకు బానిసలు కాకూడదని నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు పేర్కొన్నారు.తిరుపతి నుండి విశాఖపట్నం వరకు సైకిల్ ర్యాలీ కొనసాగుతుందని 17 రోజులు పాటు 13 జిల్లాల మీదుగా 1000 కిలోమీటర్ల మేర ఈసైకిల్ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. నిన్న తిరుపతి జిల్లా ఎస్పీ ర్యాలీని ప్రారంభించారని నేడు రెండో రోజు నాయుడుపేటకు చేరిందని తెలిపారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర సమరంలో చేపట్టిన విధంగా డ్రగ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు దండి మార్చ్ 2.0 సైకిల్ ర్యాలీ ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## డ్రగ్స్ రహిత రాష్ట్రమే మన లక్ష్యం

**- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**



సూళ్లూరుపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని పారద్రోలి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం ముందంజలో ఉండాలన్నదే మనందరి అభీష్టమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం ఈగల్‌టీమ్, వైబ్రెంట్స్ ఆఫ్ కలామ్ సంయుక్తంగా చేపట్టిన డ్రగ్స్ వద్దు బ్రో ప్రచార కార్యక్రమాన్ని ఆమె అభినందిస్తూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచేందుకు వీలవుతుందని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పోలీసు యంత్రాంగం, జిల్లా పోలీసు యంత్రాంగంతో సమన్వయపరచుకుని గ్రామస్థాయి నుంచి విద్యాసంస్థల వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. అలాగే తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు చేపట్టిన చైతన్యయాత్ర మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు అవకాశం ఉందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆశాభావం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని డ్రగ్స్ రహిత జోన్‌గా మార్చేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో సమావేశం



వాకాడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారులతో ఎంపీడీవో సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు విధివిధానాలపై దిశ నిర్దేశం చేశారు, పంచాయతీలోని జరుగే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై పలు సూచనలు సలహాలు అందజేశారు, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులకు ఆయా పంచాయతీలలో ప్రభుత్వం పరంగా గ్రామపంచాయతీ చట్టంపై విధి విధానాలపై తగు సూచనలు ప్రత్యేక సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, డిప్యూటీ తహసిల్దార్ సయ్యద్ మహమ్మద్ రఫీ, పరిపాలన అధికారి శ్రీనివాసులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గిరిజనులకు ఉచిత విద్యుత్తు : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. పట్టణంలోని మూడవ వార్డు, బొప్పపురం ఎస్సీ కాలనీ నందు ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ఆయన ప్రారంభించారు. మొత్తం రూ. 92.28 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్యానెల్స్ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది వరకు కేవలం 50 లేదా 100 యూనిట్లుగా ఉన్న ఉచిత విద్యుత్‌ను, ఈ రోజు కూటమి ప్రభుత్వం పేదల కష్టాలను గుర్తించి 200 నుంచి 300 యూనిట్ల వరకు ఉచితంగా అందిస్తోందన్నారు. పవర్ లూమ్స్, చేనేత కార్మికులకు సైతం 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోందని గుర్తుచేశారు. ఈ సోలార్ యూనిట్ల ద్వారా భవిష్యత్తులో విద్యుత్ బిల్లుల భారం పూర్తిగా తప్పుతుందని ఆయన భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం అమరావతి రాజధానిని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో మరో 20 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమరావతిని అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారని, ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుతో రాజధాని పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ పాపాలను, అప్పులను ప్రక్షాళన చేసి, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పట్టాలెక్కిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ శ్రీనివాసులు, ఏఎంసి చైర్మన్ విశ్వనాథం,, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, రాష్ట్ర చేనేత డైరెక్టర్ గంగాధర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, కమిషనర్ ఈగ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి




వెంకటగిరి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: మండలంలో ఉన్న భూ సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తహసిల్దార్ పి. శిరీష తెలిపారు. తహసిల్దారుగా ఆమె బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తాసిల్దార్‌గా ఉన్న నరసింహారావు కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పలువురు సిబ్బంది ఆమెను అభినందించారు.

# పనులు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై జాయింట్ కలెక్టర్. ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులులతో కలిసి సంబంధిత హెచ్‌ఓడిలతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్. డా, ఎస్. వెంకటేశ్వర్ బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరం నుండి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని సంబంధిత జిల్లా అధికా రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్‌సిఎం ద్వారా మంజూరైన పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడే విధంగా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన పనులపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలు, నీటి సరఫరా, విద్య, వైద్యం, వ్యవసాయం, రహదారులు, పరిశ్రమలు వంటి కీలక రంగాల్లో మంజూరైన పనులను ప్రాధాన్యతగా తీసుకుని అమలు చేయాలని సూచించారు. ప్రాజెక్టుల పురోగతిపై వారానికొకసారి సమీక్ష నిర్వహించి, ఎటువంటి ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.అలాగే, పనుల అమలులో పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచాలని చెప్పారు. సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన మంజూరుల వివరాలు, ప్రస్తుత పురోగతి, ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో ఏ ఎస్పి రావిమనో హరచ్చారీ, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి,నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, ఎల్. శివకుమార్, ఇరిగేషన్ డిఈ, రాధా కృష్ణా, ఆర్‌అండ్ బిఎస్ఈ, రాజా నాయక్, డిఎమ్‌అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, సివిల్ సప్లై అధికారి శేషు రాజు, ఏపిఎమ్‌ఐపిపి డి.చిన్న రెడ్డయ్య,గృహనిర్మాణం శాఖ పిడి,ఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ జగదీష్, పంచాయతీ రాజ్ ఎస్ఈ మధుసూదన్, అటవీ శాఖ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## వినతుల స్వీకరించిన ఎస్సీ కమీషన్



చిత్తూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమీషన్ చైర్మెన్ కెఎస్ జవహర్ బుధవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహం నందు షెడ్యూల్డ్ కులాల ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. గంగాధర నెల్లూరు మండలం తూగుండ్రంలో నివసిస్తున్న గోవిందమ్మ మాట్లాడుతూ తన భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారనీ, ఆ భూమి నాదే అని జిల్లాకోర్టులోను, ఆర్డీవో, జాయింట్ కలెక్టరు కోర్టులోను నాకు అనుకూలమైందన్నారు. నా భూమికి నాయకు పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని వినతి చేసారు. అలాగే రామకుప్పం మండలం, బందార్లపల్లి పంచాయతీ గడ్డూరు గ్రామానికి చెందిన ధనలక్ష్మి, రాధమ్మ, ఆదిలక్ష్మిలు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన వారమని, పేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన డికెటీ భూములను స్వాధీనం చేసుకొంటున్నారనీ, 55 సంవత్సరాలుగా సాగు చేసుకొంటున్న భూములను గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు పేరుతో తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. పెద్దపంజాణి మండలం బట్టందొడ్డి గ్రామానికి కృష్ణప్పకు పట్టా మంజూరుచేసారని, మా తాత, మా తండ్రి అనుభవించుకొంటూ సాగు చేసుకొంటున్నారన్నారు. తదనంతరం ప్రభుత్వం అసైన్డ్ భూమిని రెగ్యులర్ చేయమని తెలిపినా విఆర్ఓ చేయడం లేదన్నారు. దయతో భూమిని రెగ్యులర్‌గా సెటిల్మెంట్ చేయించమని కమీషన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కొంతవరకు అనుభవంలో వుంటూ వాళ్లకి ఎలాంటి దాఖలాలు కూడా లేదనందున అనుభవం వున్న వాళ్లకి హోదా కల్పిస్తూ కాంపోజిషన్ వచ్చేటట్లు చూడాలని, పేద దళితుల హక్కులను కాపాడాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల కమీషన్‌ను కోరారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎస్సీ కమీషన్ పనిచేస్తోందని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జవహర్ హామి ఇచ్చారు.

## చోరీ కేసు పేరిట నలుగురిని ఎత్తుకుపోయారు.!

**-5 రోజులుగా ఆచూకీ చెప్పడంలేదు.!**

**-చవటకాల్వ ఎస్టీకాలనీలో మహిళల ఆవేదన**



చంద్రగిరి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: అర్ధరాత్రి వేళ చోరీ కేసు పేరిట తమ వారిని నలుగురిని మఫ్టీలో వచ్చిన పోలీసులు దౌర్జన్యంగా ఎత్తుకుపోయారంటూ గిరిజన మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామానికి చెందిన కవిత బుధవారం గ్రామస్థులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎస్టీలమై నందున తమ నిస్సహాయ స్థితిని గ్రహించి బాలాజీ, పవన్ కళ్యాణ్, నాగరాజు, నాసయ్య అనే నలుగురిని శనివారం రాత్రి మఫ్టీలో వచ్చిన పోలీసులు బలవంతంగా తీసుకెళ్ళినట్లు బాధితులు వాపోయారు. ఈ క్రమంలోనే మూడు బైక్‌లను, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చంద్రగిరి, తిరుచానూరు పోలీస్ స్టేషన్లలో 5 రోజులు అక్రమంగా నిర్బంధించి దొంగతనాలు చేసినట్లు అంగీకరించాలని తీవ్రంగా కొడుతున్నట్లు తెలిపారు. చట్టప్రకారం కేసులు నమోదుచేసి విచారణ చేయాల్సిన పోలీసులు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు వాపోయారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తమ వాళ్ళ ఆచూకీని వెల్లడించాలని, తమకు న్యాయం చేసి బాధితులను విడుదల చేయాలని కోరారు. బాధితులకు మద్దతుగా దళిత సంఘ నాయకులు గ్రామానికి చేరుకుని మద్దతు పలికారు.

**- పెద్ద ఎత్తున ట్రాన్స్ ఫార్మర్లలో కాపర్ చోరీ..?**

అనధికారిక సమాచారం ప్రకారం చవటకాల్వకు చెందిన నలుగురు, తిరుపతికి చెందిన ఒకరు, నెల్లూరుకు చెందిన మరొకరు కలసి మండల పరిధిలో పెద్దఎత్తున రైతుల పొలాల వద్ద గల ట్రాన్స్ ఫార్మర్లను క్రిందకు దొర్లించి అందులోని కాపర్‌ను చోరీ చేస్తున్నట్లు పోలీసులకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై ప్రత్యేక బృందాలతో నిరంతర నిఘా కొనసాగిస్తున్న క్రమంలో పోలీసులకు విశ్వసనీయ సమాచారం లభించింది. దీంతో చవటకాల్వకు చెందిన నలుగురిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

## జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణపై

**-జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ సమీక్ష**



తిరుపతి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, రవి మనోహరాచారి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా ఎస్పీ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులపై విడివిడిగా సమగ్రంగా చర్చించి, కేసుల దర్యాప్తు స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం సహించబోమని హెచ్చరిస్తూ, నాణ్యమైన దర్యాప్తుతో నిందితులను చట్టం ముందు నిలబెట్టాలని ఆదేశించారు. ప్రతి కేసు మీద బాధ్యతాయుతంగా వ్యవహరించి, సమయపాలన పాటించాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాలో నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నచిన్న వివాదాలను కూడా ముందస్తుగా పరిష్కరించి పెద్ద సమస్యలుగా మారకుండా చూడాలని సూచించారు. సైబర్ నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు సమన్వయంతో పని చేసి, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని ఎస్పీ తెలిపారు.

## ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి రథోత్సవం



శాంతిపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త: శాంతిపురం మండలం కెనమా కులపల్లి గ్రామంలో నెలకొని ఉండు శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఘనంగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు పానకం, ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు కూడా తమ మొక్కులను తీర్చుకున్నారు. రథం పై వివిధ రకాల వస్తువులను చల్లుతూ తమ కోర్కెలను తీర్చాలని కొందరు భక్తులు కోరుకోగా మరికొందరు తమ కోర్కెలు తీరాయి అంటూ వారి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమం కెనమా కులపల్లి, గడ్డూరు గ్రామస్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు.

# రైతు సంక్షేమానికి: మద్దతు ధరకు ప్రాధాన్యత ఇద్దాం!

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 8 ప్రభాతవార్త



'శ్రీకాళహస్తి నియోజకవర్గం ఆది నుంచి వ్యవసాయ క్షేత్రంగా ఉందని ఇక్కడ ఏటా రెండు పంటలు పండిస్తున్నారని ఈ ప్రాంత రైతులను ఎప్పుడూ పనిలో నిమగ్నమై మూడు పంటలు పండించుకొనుటకు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సోమశిల-స్వర్ణముఖి కాలువను తెచ్చారని అయితే నేడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుటకు అధికారులు నాయకులు కలసి ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచించారు. పంచాయతీరాజ్ అతిథి గృహంలో వ్యవసాయశాఖ, పార్టీ ముఖ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతు సంక్షేమానికి పలు ప్రణాళికలను సూచించి అమలుకు వ్యవసాయాధికారులు మండలాల్లోని పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలని ఎంఎల్ఏ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రైతులు ప్రతిసారి పంట చేతికొచ్చే సమయంలో విపత్తులను ఎదుర్కొంటున్నారు. ఈ విపత్తుల నుంచి కాపాడుకోవటానికి కృషి చేయాలన్నారు. అందుకే గోదాములను నిర్మించుకుందామన్నారు. పి'4 పథకంలో పెట్టుబడులను అందిస్తామం నాయకులు ముందుకు వచ్చి గోదాములు నిర్మించి రైతును ఆదుకొనుటలో భాగస్వాములు కావాలని సూచించారు. అలాగే రైతుల పరిస్థితులనుస మీక్షించుటకు మండలానికి 20 డ్రోన్లు కావాలని మండల నాయకులు కోరారు. అందుకు వెంటనే ఎంఎల్ఏ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు సాధిద్దామన్నారు.

## శ్రీకాళహస్తిలో వ్యవసాయశాఖ పని తీరు భేష్ సమీక్షా సమావేశంలో ప్రసంశించిన ఎంఎల్ఏ

**మద్దతు ధరకు సహకరిద్దాం:**

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తుంది అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దటానికి పంట చేతికొచ్చే సమయంలో దళారులు వాలుతున్నారు. రైతు శ్రమను దోచుకుంటున్నారు. అలా కాకండా పంటచేతికొచ్చే సమయానికి వ్యవసాయశాఖ, నాయకులు, మిల్లర్లు కలసి ప్రతి గ్రామంలో ఓ సేకరణ కేంద్రం ఏర్పాటు చేద్దాం. అక్కడ ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర అలాగే దళారులు కొనుగోలు చేసే ధరలను సమన్వయం చేసుకుంటూ రైతులకు ఆమోదయోగ్యమైన ధరలను ప్రకటిద్దాం. అని వివరించారు. అలా చేస్తే దళారుల నుంచి రైతుల్ని కాపాడిన వారౌతాము. అంతేకాక కొందరు దళారులు రైతుల నుంచి సరకు సేకరించి సొమ్ములు చెల్లించక ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎంఎల్ఏ వివరించారు. ఇలాంటి బాధల నుంచి అన్నదాతకు ఉపశమనం కల్పించుట తమ బాధ్యతగా స్వీకరిద్దామన్నారు. ఇందుకు మిల్లర్లు సహకరించాలని సూచించారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంఎల్ఏ అభ్యర్థించారు.

**వ్యవసాయశాఖ పని తీరు భేష్:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వ్యవసాయశాఖ పని తీరుభేష్ అని ప్రశంసించారు. యూరియాను అందింటం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందించటంలో చాలా బాగా పని చేస్తున్నారన్నారు. అలాగే రైతులకు పంటలపై ఆశించే తెగుళ్ల వాటి నివారణ, రైతుల సమాచారాన్ని కంప్యూటరీకరణలో ఎంతో చక్కగా పని చేస్తున్నారని అభినందించారు. రైతులేనిదే రాజ్యం లేదు. మనకు నిత్యం అన్నదాతలుగా ఉన్న రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ఎడిఏ రమేష్‌రెడ్డి, మండలాల వ్యవసాయాధికారులు మమతరెడ్డి (శ్రీకాళహస్తి) సరేంద్రరెడ్డి (తొట్టంబేడు) సాగరిక(ఏర్పేడు), సునీతరెడ్డి(రేణిగుంట) ఇక తెలుగుదేశం పార్టీ నాయకులు మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, రావిళ్ళ మునిరాజానాయుడు, బత్తిరెడ్డి, కృష్ణయాదవ్, బొల్లినేని జగన్నాథం నాయుడు, ధనంజయులు నాయుడు, పేరం నాగరాజనాయుడు, సూరినాయుడు, చిన్నారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపత్తులు, వర్షాకాలం ఆదుకొనుటకు వ్యవసాయశాఖ ద్వారా టార్పాలియన్లును అందుబాటులో ఉంచి ఆదుకోవాలని కోరారు.

## నీటి కొరకు లేకుండా ముందస్తు చర్యలు.....

రేణిగుంట ఏప్రిల్ 8 ప్రభాతవార్త



ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట పట్టణంలో నీటి కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. రేణిగుంట పట్టణం జ్యోతి నగర్, రమణ విలాస్ సర్కిల్ ప్రాంతాల్లో వేసవి కాలం ప్రజలకు నీటి కొరత లేకుండా చేయాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచనల మేరకు నూతన బోరు నిర్మాణం బుధవారం చేపట్టారు. ముందుగా భూమి పూజ చేసి బోరు వేసే యంత్రంతో డ్రిల్లింగ్ వేశారు. బోరు వేసిన ప్రాంతంలో పుష్కలంగా నీరు పడింది. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీలోని అనేక ప్రాంతాల్లో బోర్లు వేయిస్తున్నట్లు మహబూబ్ బాషా తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర, ఆర్డబ్ల్యుసి సిద్ధారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పుష్పనాదం, యూనిట్ ఇంచార్జి బాబు, మహిళా నేత మేరీ, యువ నేత చైతన్య తదితరులు పాల్గొన్నారు

## గాజులమండ్యం ఎస్సైగా హరీష...

రేణిగుంట ఏప్రిల్ 8 ప్రభాతవార్త



రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని రూరల్ సర్కిల్ గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ గా హరీష పదవీ బాధ్యతలు బుధవారం చేపట్టారు. ఇప్పటివరకు స్టేషన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు బదిలీపై తిరుపతికి వెళ్లారు. ఆయన స్థానంలో హరీష తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిక్కచ్చిగా వ్యవహరి స్తానని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రోటోకాల్ విధులు సక్రమంగా నిర్వహిస్తా మన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు ఆస్కారం ఉండదన్నారు.

## హైకోర్టు తీర్పును వెంటనే అమలు పరచాలి: వెంకటాద్రి యాదవ్..

రేణిగుంట ఏప్రిల్ 8 ప్రభాతవార్త



తక్కువ వేతనాలతో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలని హైకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు పరచాలని తిరుపతి జిల్లా బి ఎం ఎస్ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. అనేక ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగులు తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. అలాంటి వారి జీవితాల్లో వెలుగులు నింపే విధంగా హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును తక్షణం అమలు పరచాలని డిమాండ్ చేశారు.

## జాతీయ స్థాయిలో అర్థాల కేశవులకు కీలక బాధ్యత

తిరుపతి విద్య, ఏప్రిల్ 8 ప్రభాత వార్త



ప్రొటెక్షన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఫోర్స్ సంస్థకు అర్థాల కేశవులు జాతీయ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకులు బండి పట్టాభి రెడ్డి అధికారికంగా ప్రకటించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రముఖుడైన కేశవులు, కే7 ఇన్ఫోటెక్ సీఈఓగా కొనసాగుతూనే సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. అర్థాల అల్లెయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు సేవలు అందించడంతో పాటు, ఆర్‌టిఐ నేషనల్ కన్వీనర్‌గా ప్రజల్లో చట్టంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ సాంకేతికతను, చట్టబద్ధ హక్కులను సమన్వయం చేసి పేదలకు అండగా నిలవడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. తనపై విశ్వాసంతో ఈ బాధ్యత అప్పగించిన బండి పట్టాభి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకంపై సామాజిక కార్యకర్తలు, సాఫ్ట్‌వేర్ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తూ కేశవులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్‌ను పరామర్శించిన నాయకులు

తొట్టంబేడు ఏప్రిల్ 8 ప్రభాతవార్త



తొట్టంబేడు మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామాంజులు నాయుడు ను తొట్టంబేడు మాజీ మండల అధ్యక్షుడు గాలి మురళి నాయుడు. పరామర్శించారు. సత్యవేడు నియోజకవర్గం, కెవిబి పురం మాజీ మండల పార్టీ అధ్యక్షులు బీసా బత్తిన రామాంజులు నాయుడు అనారోగ్యంతో బాధపడుతూ, అపోలో ఆసుపత్రిలో చికిత్స పొంది, సొంత గ్రామమైన ఎంఏ రాజుల కండ్రిగ కు వచ్చిన సందర్భంగా విషయం తెలుసుకున్న తొ ట్టంబేడు మండల మాజీ పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు కర్లపూడి ఆయకట్టు అధ్యక్షులు చీళ్ల వెంకట మునిరెడ్డి వారి స్వగృహానికి వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకొని, పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో అందరూ కలిసి అధికారంలోకి తీసుకువచ్చిన ప్రస్తుతం పార్టీ దూరం పెట్టినంత మాత్రాన మన కార్యకర్తల కోసం పార్టీ కోసం ప్రజల్లో తిరుగుతూ కార్యకర్తలని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని, పార్టీలు మారి వచ్చిన నాయకులకు ఉన్న గుర్తింపు కష్టపడ్డ నాయకులకు లేదని ఆవేదన వ్యక్తపరచి ఎప్పటికైనా మన శ్రమకు ప్రతిఫలం ఉంటుందని భరోసా కల్పిస్తూ, మీరు త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం మీకు రావాలని శ్రీ కాళహస్తీశ్వర జ్ఞాన ప్రసూనంబ అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని మురళి నాయుడు, వెంకట మునిరెడ్డి కోరారు.

## ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుని నియామకం

తొట్టంబేడు ఏప్రిల్ 8 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడుగా డి. ధన శేఖర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ధన శేఖర్ మాట్లాడుతూ విలేకర్ల సమస్యలపై తాను నిత్యం అందుబాటులో ఉంటూ తన వంతు కృషి చేస్తానని అదేవిధంగా ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను ముందుంటానన్నారు. మీడియా హక్కుల పరిరక్షణకు ప్రత్యేకంగా, జర్నలిస్టులకు కార్పొరేట్ సంస్థల నుంచి వైద్యం విద్య, సొంత ఇంటి కల నెరవేర్చడం వంటి హక్కుల సాధన పరిరక్షణకు ఎల్లప్పుడు ముందు ఉంటాను అన్నారు.

## కోర్ట్ విధులను బహిష్కరించిన న్యాయవాదులు

శ్రీకాళహస్తి ఏప్రిల్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు .ఆరంభాకం ముని ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు విధులను బహిష్కరించారు. అన్నమయ్య జిల్లా, పీలేరు నియోజకవర్గంలోని కె.వి పల్లి మండలం, తాతగుంటపల్లి పంచాయితీ, పాత వడ్డిపల్లి గ్రామానికి చెందిన యువ న్యాయవాది పూజారి ఎల్లయ్యను సోమవారం రాత్రి 11 గంటలకు ఇంటి తలుపులు పగలగొట్టి నిద్రిస్తున్న న్యాయవాదిని అత్యంత దారుణంగా హత్య చేయడం బాధాకరమన్నారు. అడ్డువచ్చిన తల్లిదండ్రులను పూజారి వెంకటరమణ, రెడ్డమ్మలను దారుణంగా రక్త గాయాలు చేశారని, ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాదులకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహాలో ఆంధ్ర రాష్ట్రంలోనూ న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలని కోరారు. హత్యకు నిరసనగా న్యాయవాదులు నినాదాలు చేసి తమ విధులను బహిష్కరించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కాకి చిన్న అంకయ్య, ప్రధాన కార్యదర్శి ముత్యాల తులసీరామ్, దేవి, సుజాత, మునిశేఖర్, మీర్జావలి, రాజేష్ రాయల్, పొన్నేపల్లి వెంకటాచలపతి, శశి కుమార్, మాజీ ఏపీపీలు కే కుమార్, కన్నలి ప్రభాకర్ రెడ్డి, వీర రాఘవరెడ్డి, మాజీ ఏజిపి పట్టాభి రెడ్డి, ఏజీపీ కమల్ కుమార్, ఏపీపీ జై సారథి, మాజీ అధ్యక్షులు ప్రసాద్ నాయుడు తో పాటు పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## అక్కూర్తి పాఠశాల అభివృద్ధికి ఎంఎల్ఏ చర్యలు

శ్రీకాళహస్తి రూరల్ ఏప్రిల్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూపు రేఖలు మారనున్నాయి. శ్రీకాళహస్తికి సమీపంలోని పాఠశాలకు విశాలమైన ఆటస్థలం ఉంది. ఇటీవల ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న పెండింగ్ పనులను 90 రోజులలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు మొదటి అడుగుగా, పాఠశాల అభివృద్ధి కోసం సుమారు 4000 చదరపు అడుగుల టైల్స్‌ను ఉచితంగా అందించేందుకు సోమానీ టైల్స్ కంపెనీతో ఎమ్మెల్యే గారు సంప్రదించి ఏర్పాట్లు చేశారు. ఈ చర్య పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎమ్మెల్యే సేవా దృక్పథాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పాఠశాల అభివృద్ధికి ఉచితంగా టైల్స్ అందించిన సోమానీ టైల్స్ కంపెనీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# తొట్టంబేడు గ్రంథాలయానికి మంచిరోజులు: కొత్తభవనం

తొట్టంబేడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రెడ్డివారి గురవారెడ్డి

ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని శాఖా గ్రంథాలయాలకు మంచి రోజులు వస్తున్నాయని ఉమ్మడి చిత్తూరుజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి వివరించారు. బుధవారం ఆయన తొట్టంబేడు గ్రంధాలయాన్ని సందర్శించారు. మార్పు ప్రక్షాళన తొట్టంబేడు గ్రంథాలయం నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు. ఈ మేరకు రికార్డులను హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేసి అక్కడున్న పాఠకుల తో ప్రత్యేకంగా సమావేశమై గ్రంథాలయంలో వసతులు ఎలా ఉన్నాయో పత్రికలు అందుబాటులో ఉన్నాయా? విద్యార్థుల పరీక్షల కి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా? అనే విషయాలనుడ్డి అడిగి తెలుసుకున్నారు. స్థానిక గ్రంథాలయ అధికారి తో ప్రస్తుతం గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల విషయాలు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కి సంబంధించిన పుస్తకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంముతో ముఖ్యమంత్రి, విద్యా మంత్రివర్యులు నారా లోకేష్ దృఢ సంకల్పంతో ఉన్నారు కాబట్టి గ్రంథాలయాలని పాఠకులకు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్‌అయ్యే విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరుతున్నామన్నారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న ఆధునిక యుగంలో గ్రంథాలయాల్లో కూడా డిజిటల్ విధానంను ప్రవేశ పెట్టె ఆలోచన ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. అక్కడ ఉన్న పాత గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి అతి త్వరలో నూతనంగా నిర్మితమవుతున్న గ్రంథాలయ భవనము అందుబాటులోకి వస్తుందని అన్నారు. అనంతరం పక్కనే నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి స్థానిక గ్రంథాలయ అధికారికి భవనానికి సంబంధించి చేయాల్సిన పనుల గురించి పలు సూచనలు చేశారు . భవన నిర్మాణం కొరకు అదనంగా మూడు లక్షల రూపాయలు నిధులను ప్రస్తుత బడ్జెట్లో పెట్టి అనుమతులు కూడా మంజూరు చేయిస్తామని, భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారుల ద్వారా కాంట్రాక్టర్ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గ్రంథాలయ అధికారి ఎ.హరిక్రిష్ణ తదిత పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ముత్యాలమ్మకు సారె అందించిన ఎంఎల్ఏ దంపతులు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయంలో జరుగుతున్న మూడుజాతర సందర్భంగా స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దంపతులు అమ్మవారికి సారెను అందించారు. ఎంఎల్ఏ దంపతులు సారెతో ఆలయం వద్ద రాగా వారికి ఆలయ మర్యాదలతో డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి వారి సిబ్బంది ముత్యాలమ్మ ఆలయ పూజారులు ఘనస్వాగతం పలికారు. ఎంఎల్ఏ దంపతులు నడుచుకుంటూ సారెను ఆలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ దంపతులు ఆలయంలోని శేష పాన్పు ముగ్గులో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి పూజలు జరిపించారు. ఈ కార్యక్రమాల్లో వారితో పాటు మాజీ ధర్మకర్తల మండలి సభ్యురాలు బూడిదవాకం రేణుకాదేవి, మండల పార్టీ అధ్యక్షురాలు సుమతి తదితరులున్నారు. ఏర్పాట్లును చిన్న ఆలయాల ఇన్‌చార్జి రవి, లక్ష్మయ్య, దుర్గ తదితరులు స్వాగతం పలికారు.

## చిన్నారి మృతికి విద్యాశాఖ నివాళులు

ఏర్పేడు,ఏప్రిల్ 8 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం చిందేపల్లికి చెందిన సుశ్మిత మృతదేహానికి మండల విద్యాశాఖ అధికారి ప్రేమ లత, దయాకర్‌రావు, చిందేపల్లి పాఠశాల ప్రధానో పాధ్యాయులు రాధాకృష్ణ తదితరులు నివాళుల ర్పించారు. చిందేపల్లి పాఠశాలలో చదువుతున్న సుస్మిత మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలసి ఆడుకుంటూ చెరువు వద్దకు వెళ్ళటం అక్కడ జేసిబితో తీసిన గుంతలో పడి మృతి చెందిన విషయం విదితమే. పొట్టకూటి కోసం నెల్లూరు జిల్లా నుంచి చిందేపల్లికి వచ్చిన తల్లిదండ్రుల శోకానికి ఎవ్వరూ ఓదార్చలేక పోయారు. వారితోపాటు పాఠశాల ఉ పాధ్యాయులు గురువారెడ్డి, దేవరాజులు, సిఆర్పీలు వెంకటముని, మునిసురేష్, మునీశ్వర్ ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించి చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులకు విన్నవించారు.

## చెల్లూరుపాఠశాల ఆటస్థలం ఆక్రమణపై ఎంఎల్ఏ అసహనం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 8 ప్రభాతవార్త




ఏర్పేడు మండలంలోని చెల్లూరు పంచాయతీలోని మండల ప్రాథ మిక పాఠశాల ఆటస్థలాన్ని కొంద రు ఆక్రమించుకోవటం దానిని రిజి స్ట్రేషన్ చేసిన సంఘటన బుధవా రం శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీరెడ్డి దృష్టికి వచ్చింది. పంచా యతీరాజ్ అతిథి గృహంలో ఆయ న ప్రజా సమస్యలపై విచారిస్తుండగా చెల్లురు పాఠశాల ఆటస్థలానికి సంబందించిన సమస్యను మండలానికి చెందిన పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు మాజీ జిల్లా పరిషత్ సభ్యుడు పేరం ధనంజయులు నాయుడులు చెల్లూరు వాసులతో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డిని కలసి వివరించారు. ఆయన వెంటనే తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్‌తో చరవాణిలో మాట్లాడారు. కోర్టు వివాదం ఉన్న రికార్డుల్లో పాఠశాల ఆట స్థలంగా నేటికి కూడా ఉన్న రికార్డులను ఎలా రిజిస్ట్రర్ చేసారని ప్రశ్నించారు. సబ్‌రిజిస్ట్రార్ ఇచ్చిన సమాధానంతో సంతృప్తిపడని శాసనసభ్యుడు అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. పాఠశాలకు సంబంధించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయటమేమిటి? నేరు కలెక్టర్‌తో మాట్లాడుతాను అంటూ చెల్లురు వాసులకు భరోసా ఇచ్చారు.

## ముత్యాలమ్మ ఆలయంలో అన్నదానం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబం ధంగా నిర్వహిస్తున్న ముత్యాల మ్మ ఆలయంలో జాతర సంబ రాల్లో చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజూ వారు ఆలయం వద్దకు చేరుకొని కార్యక్రమాలను సమీక్షిస్తు న్నారు. ఉదయం నుంచి పూజ ల్లోనూ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ అధికారులు, అర్చకులు, సిబ్బందికి దిశ దేశ నిర్దేశం చేస్తున్నారు. ఈ నేపధ్యంలో బుధవారం ఉదయం ఆలయంలో మహిళా భక్తుల భాగస్వామ్యంతో అంబళ్లు పోసారు. తరువాత మధ్యాహ్నం భక్తుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్‌తో పాటు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, నాగరాజు, సిబ్బంది రవి, లక్ష్మయ్య, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు ఎన్నికల్లో ఆంధ్ర నాయకుల ప్రచారం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



తమిళనాడు ఎన్నికల్లో తిరుపతిజిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నేపధ్యంలో బుధవారం రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న పొన్నేరి నియోజకవర్గంలోని కాంగ్రెస్ అభ్యర్థి దొరై చంద్రశేఖర్ గెలుపు కోసం ప్రచారం చేపట్టారు. పార్టీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ఆదేశాలతో ప్రచారంలో చేపట్టిన కాంగ్రెష్ నాయకులు దేశంలో కాంగ్రెస్ సారధ్యంలోని ఇండియా కూటమి విజయం సాధిస్తుందని అది తమిళనాడు నుంచి శ్రీకారం అవుతుందని ఓటర్లను వివరిస్తున్నారు. ఈ ప్రచారంలో శ్రీకాళహస్తికి చెందిన తలపా దామోదర్‌రెడ్డి తిరుపతిజిల్లా అధ్యక్షుడు బాలగురువం బాబుజిల్లా ప్రధానకార్యదర్శి గండవరపు రమేస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మ దేవదానం, జిల్లా అధికార ప్రతినిధి పర్వతాల శ్రీనుగౌడ్ ఓబిసి జిల్లా అధ్యక్షుడు బాలరాజు, జిల్లా మైనారిటి సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కెరాజిక్, సురేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అలిపిరిలో “ఫేస్‌చెక్ ”ఎప్పుడో !?

## సప్తగిరి తనిఖీకేంద్రం వద్ద అధునాతన కెమెరాలు ఏవీ!!




ప్రభాతవార్తప్రతినిధి–తిరుమల:

పుణ్యక్షేత్రం తిరుమల భద్రతపై కేంద్ర,రాష్ట్ర నిఘావర్గాలు ప్రత్యేక దృష్టి సారించినా నేరస్తులు, అనుమానితుల కదలికలపై ఫేస్‌చెక్‌చేసే పరిస్థితి కనిపెట్టే వ్యవస్థ అందుబాటులోకి రావడంలేదు. ప్రతిరోజూ దేశవిదేశాల నుండి లక్షమంది యాత్రికులు పలు రకాలుగా తిరుమలకు వస్తున్నారు. ఇలా వస్తున్న వారిలో ఎవరు, ఏమిటనేది స్పష్టంగా కనిపెట్టే వ్యవస్థ టిటిడి భద్రత విభాగం ఇప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రంలో ఏర్పాటుచేయలేకపోతోంది. యాత్రికులు వస్తున్న వారిపై నిశితంగా గమనించే ఈ అధునాతన “ఫేస్‌చెక్”ద్వారా గుర్తించే విధానం అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారు. ఫేస్‌రికగ్నేషన్ కెమెరా వ్యవస్థ ఉంటే నిందితులు, నేరస్థులు, తీవ్రవాదులు, ఉగ్రవాదులు,దోపిడీదొంగల్ని సులభంగా గుర్తించడానికి వీలుంటుంది. ఎంతో ప్రాధాన్యత ఉన్న తిరుమల పుణ్యక్షేత్రంకు వస్తున్న భక్తుల రక్షణతో బాటు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయ భద్రతను మరింతగా పటిష్టంచేస్తూ క్షణాల్లో భద్రత వ్యవస్థ అలర్ట్ అయ్యేలా చూడాల్సి ఉంటుంది. తిరుమలకు ప్రధాన ప్రవేశద్వారమైన అలిపిరి సప్తగిరి తనిఖీకేంద్రానికి ముందు వచ్చే అలిపిరి గరుడ ఆర్చి ప్రవేశ ద్వారం, ఆ తరువాత దీనికి కొంత పక్కనే భక్తుల కాలినడక మార్గం ఉంది. ఇవన్నీ దాటుకుని వస్తే సప్తగిరి తనిఖీ కేంద్రం (అలిపిరి టోల్‌గేట్)లో 12 వరుసల ప్రవేశ మార్గాలు ఉన్నాయి.. ఈ మార్గాల్లో విఐపిలతోబాటు యాత్రికుల వాహనాలు తనిఖీ చేసుకుని కొండకు వచ్చేలా 8వరుసలు, రెండు వరుసలు ద్విచక్రవాహనాలకు, మూడువరుసలు ఆర్టీసి బస్సులకోసం నిర్వహిస్తున్నారు. ఇక్కడ తెల్లవారుజామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు నిరంతరాయంగా వాహనాల తనిఖీలతో బాటు యాత్రికులను,లగేజీలను నిశితంగా తనిఖీ చేస్తుంటారు. ఇందుకోసం టిటిడి సెక్యూరిటీ సిబ్బందితోబాటు ఎస్‌పిఎఫ్,ప్రైవేటు సెక్యూరిటీ, విశ్రాంత సైనికోద్యోగులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తుంటారు. తనిఖీ కేంద్రం పూర్తిగా అలిపిరి ఏవిఎస్‌ఒ(సిఐ హోదాలో విజిలెన్స్ అధికారి) పర్యవేక్షణలో ఉంటుంది. యాత్రికులు తెచ్చే ప్లాస్టిక్ నీళ్లసీసాలు, తమలపాకులు, హాన్స్,ధూమపానం ప్యాకెట్లు లాగేయడం తప్ప ప్రమాదమైన వస్తువులు తెచ్చినా కనిపెట్టలేకపోతున్నారు. గతంలో తిరుమలకు మద్యం బాటిళ్ళు తీసుకురావడం, డ్రోన్‌కెమెరాలతో కొండకు చేరుకోవడం, అన్యమతానికి చెందిన దేవుళ్ళ బొమ్మలతో, జెండాలతో చేరుకున్న రోజులు ఉన్నాయి..వస్తున్న యాత్రికులు ఎవరు,ఎలాంటి వారు, వారి స్వభావం కనిపెట్టే పరికరాలు కూడా లేవు.

# తిరుపతి డివిజన్

## అనుభవం ఉన్న నేతలే మార్గం నిర్దేశకులు...

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



మాధవరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

రేణిగుంట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

అనుభవం ఉన్న సీనియర్ నాయకులే కార్యకర్తలకు మార్గ నిర్దేశకులని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు శ్రీకాళహస్తి మార్కెట్ డైరెక్టర్ మాధవరెడ్డిని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి బుధవారం రేణిగుంట మండలం తిమ్మయ్య గుంట గ్రామం నందు ఆయన స్వగృహంలో పరామర్శించారు. గత కొంతకాలంగా మాధవరెడ్డి అనారోగ్యంతో ఉన్నారు. ఆయనను పరామర్శించడానికి స్వయంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి యోగ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్య వచనాలు చెప్పారు. పార్టీ పరంగా వ్యక్తిగతంగా మాధవరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాధవ రెడ్డి లాంటి సీనియర్ నాయకులు పార్టీకి దిశా దశ నిర్దేశకులని అన్నారు. పరామర్శించిన వారిలో శ్రీకాళహస్తి మార్కెట్ చైర్మన్ చెంచయ్య నాయుడు, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, కరకంబాడి టిడిపి క్లస్టర్ ఇంచార్జి బుజ్జి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు అన్నాసంపల్లె కాపీ రెడ్డి నాదముని రెడ్డి, వెంకట ముని రెడ్డి, చెంచయ్య, చంద్రయ్య యాదవ్, జనార్దన్ రెడ్డి, రాజేంద్ర, చెంగలరాయులు, వీరేంద్ర రెడ్డి, మోహన్ రెడ్డి, మోహన్ రెడ్డి, చందు తదితరులు ఉన్నారు..

## మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలిసిన కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో బుధవారం తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో రైల్వేకోడూరు వైసిపి సీనియర్ నాయకులు స్టేట్ ఎగ్జిట్ కౌన్సిలర్ నెంబర్ రామిరెడ్డి ధ్వజారెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైసీపీకి సంబంధించిన పార్టీ పరిస్థితులపై మాజీ ముఖ్యమంత్రితో పార్టీస్థితిగతులను వివరిం చినట్లు తెలిసింది. అదేవిధంగా భవిష్యత్తులో రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైసిపి పార్టీకి బలమైన క్యాడర్ను కాపాడుతూ, అదే విధంగా పార్టీకి పూర్వవైభవాన్ని తెచ్చేందుకు నిరంతరం శ్రమిస్తానని మాజీ ముఖ్యమంత్రితో అన్నట్లు ధ్వజరెడ్డి వర్గీయులు తెలిపారు.

## సివిల్ సర్వీసుల వైపు విద్యార్థుల దృష్టి మళ్లించాలి

### డీఎస్పీ శ్రీరామ్ చంద్ర శ్రీనివాస్ పల్లం

### ఘనంగా బీవీకే స్కూల్స్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

తిరుపతి విద్య ఏప్రిల్ 8 ప్రభాత వార్త




స్థానిక మహతి ఆడిటోరియంలో బుధవారం బీవీకే గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 25 వ వార్షికోత్సవ వేడుకలు (సిల్వర్ జూబ్లీ) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం నుంచి విచ్చేసిన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీరామ్ చంద్ర శ్రీనివాస్ పల్లం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, సీఈఓ అలేఖ్య, వైస్ చైర్మన్ పార్దివ రెడ్డి, ప్రెసిడెంట్ అరుణతో పాటు పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో సివిల్ సర్వీసుల్లో రాణించాలంటే చిన్నప్పటి నుంచే నైతిక విలువలు,క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడాలని తెలిపారు. సమాజంలో ఏర్పడుతున్న ఎథికల్ క్రైసెస్, పర్యావరణ సమస్యలు, ఆర్థిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే నాయకత్వ లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో విజ్ఞానం, టెక్నాలజీతో పాటు మానవ విలువలు కూడా సమానంగా అవసరమని పేర్కొన్నారు. సివిల్ సర్వీసుల్లో ప్రవేశించాలనుకునే విద్యార్థులు సమాజ సమస్యలపై అవగాహన పెంపొందించుకోవడం, ప్రజల పట్ల సేవాభావం కలిగి ఉండడం ఎంతో కీలకమని అన్నారు. కష్టపడి చదవడం, పట్టుదలతో లక్ష్యాలను సాధించడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని విద్యార్థులను ప్రోత్సహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల్లో మంచి సంస్కారం, బాధ్యతా భావం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే, నిజాయితీ గల, బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశాన్ని ముందుకు నడిపించే నాయకులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షి ంచారు.కార్యక్రమం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుని, సిల్వర్ జూబ్లీ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా

## పేకాట రాయుళ్లు అరెస్ట్...

రేణిగుంట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త.

.రేణిగుంట అర్బన్ పోలీసులు శనివారం సాయంత్రం నలుగురు పేకాట రాయళ్లను అరెస్టు చేసి వారి నుండి 6,550 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ సీఐ జయచంద్ర కు అందిన సమాచారం మేరకు అర్బన్ పోలీసులు తారకరామ నగర్ నందు దాడి నిర్వహించి పేకాట ఆడుతున్న వాసు, లక్షీ ్మనారాయణ, ప్రకాష్, మురగయ్యలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 6, 550 రూపాయల నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

## ఘనంగా పరంధామ యాదవ్ జన్మదిన వేడుకలు



తిరుపతిరూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త.

తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కార్యదర్శి చెఱు కుల పరంధామ యాదవ్ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పరం ధామ యాదవ్ భవిష్యత్‌లో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ పట్ల విశ్వాసం, నిబద్ధతతో పాటు ఎమ్మెల్యే నానికి విశ్వాస పాత్రుడుగా ఉన్న పరంధామ యాదవ్‌కు ఆ దేవదేవుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు శ్యామ్‌బాబు, నవీన్‌లతో పాటు ప్రముఖ సిమెంట్ డీలర్ బుర్రా కిరణ్‌కుమార్‌రెడ్డి, బిల్డర్ కూరపాటి నాగమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ఢీకొని సైకిల్‌పై వస్తున్న వృద్ధుడు మృతి

కుప్పం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

కుప్పం మండలం కెడిపల్లి పంచాయతీ మటార్లపల్లి వద్ద ఓ వృధ్ధుడు సైకిల్‌పై వస్తుండగా ఆటో వచ్చి అతన్ని ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ చక్రపాణి తెలిపిన మేరకు వివరాలిలా.. మటార్లపల్లికి చెందిన మునిరామప్ప (72) బుధవారం సైకిల్‌పై వస్తుండగా అదే మార్గంలో వచ్చిన ఓ ఆటో అతన్ని ఢీకొందన్నారు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం పిఇఎస్‌కు తరలించగా మృతి చె ందాడన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## పత్రికపై దాడి హేయమైన చర్య

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

ఒక ప్రముఖ దినపత్రికపై కొన్ని అల్లరి మూకలు దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని రైల్వే కోడూరు జర్నలిస్టుల సంఘం పేర్కొంది. బుధవారం సాయంత్రం స్థానిక గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసనను తెలియజేశారు. సమాజంలో ఉన్న మంచి చెడులపై రాయడంలో సత్యం ఉందని, దానిని కొంతమంది రాజకీయ దురుద్దేశంతో దాడుల నిర్వహించడం సిగ్గుమాలిన విషయంగా చెప్పుకోవచ్చు అన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టులు భారీ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సుగవాసి రాజా, ఇర్ఫాన్, ఆంజనేయరాజు, రమేష్, పంద్ర ప్రసాద్, మారెళ్ళ ప్రసాద్, నాగేంద్ర, వి సుబ్రహ్మణ్యంతో పాటు విలేకరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్లను తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి విద్య, ఏప్రిల్ 8 ప్రభాత వార్త

పేదలకు అందుతున్న భోజన సేవల నాణ్యతను పరిశీలించేందుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం అన్నా క్యాంటీన్లను సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంటీన్లలో టోకెన్ల పంపిణీ, భోజనం నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై నిర్వాహకులు, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.మొదటగా స్విమ్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించిన ఆయన, అనంతరం ఆర్సీ రోడ్డులోని క్యాంటీన్‌ను సందర్శించి ప్రజలతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్న ఎమ్మెల్యేకు అన్నం కొద్దిగా మెరుగ్గా ఉడికితే బాగుంటుందని, సాంబారు రుచి మరింత మెరుగుపరచాలని లబ్ధిదారులు సూచించారు.ఈ విషయాలపై స్పందించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ప్రజల సూచనలను వెంటనే అమలు చేయాలని నిర్వాహకులకు ఆదేశించారు. పేదలకు రూ.5కే తృప్తికరమైన భోజనం అందించే ఈ పథకం ప్రభుత్వం చేపట్టిన ముఖ్య కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారుఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ శ్యాంసుందర్, ఈఈలు తులసి కుమార్, గోమతి, డీఈ లలిత, ఎన్డీఏ నాయకులు సీకే రేవతి, మహబూబ్ భాషా, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో పిల్లల విద్యాభివృద్ధికి ఆర్కే అబాకస్ ప్రత్యేక శిక్షణ



తిరుపతిరూరల్, ఏప్రిల్ 8 ప్రభాత వార్త

తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి సర్కిల్‌లో ఉన్న ఆర్కే అబాకస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా కార్యక్రమాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు సమాయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకునేలా ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థుల మేథస్సు, నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా అనుభవిజ్ఞులైన అధ్యాపక బృందంతో శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో అబాకస్, వేదిక్ మ్యాథ్స్, హ్యాండ్ రైటింగ్, చెస్, యోగా, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, జీకే అండ్ స్పెల్ బీ, ఐఐటి మ్యాథ్స్ అండ్ సైన్స్, అన్ని సబ్జెక్టుల బేసిక్స్, స్పోకేన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి పలు అంశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక బ్యాచ్‌లు నిర్వహించబడతాయని తెలిపారు. అలాగే బైరాగిపట్టేడ, ఏ.రంగంపేట, ఎంఆర్ పల్లి సర్కిల్ కేంద్రాలలో హాస్టల్ సదుపాయంతో ఈ శిక్షణ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మరెన్ని వివరాల కోసం 7386502450, 7799884561నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే డైరెక్టర్ ఆర్కే విమలారెడ్డి, విద్యార్థులు వేద హర్షితరెడ్డి, రిత్విక్ సింహారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, గంగిరెడ్డి, శశికుమార్ యాదవ్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అంక్షలు అటకెక్కాయి: బ్రహ్మగుడి పార్కింగ్‌గా మారింది!

### ఔరా! దేవస్థానం పర్యవేక్షణ



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నియమ నిబంధనల అమలు ప్రశ్నార్థకంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆంక్షలు ఇక్కడ అమలు జరగటం ప్రశ్నార్థకంగా మారాయి.ఒక్కొక్క అధికారి వచ్చినపుడు ఒక్కొక్క నిబంధన పెడుతున్నారు.ఆ అధికారి బదిలి అయిన తరువాత ఆంక్షలు అటకెక్కుతున్నాయి.ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనాలు పరిపాలనా భవనం వద్ద పార్కింగ్ చేస్తున్నారని పిఆర్‌ఓ కార్యాలయం పక్కన షెడ్డులు నిర్మించారు. అయితే ఈ నిబంధనలు ఎక్కువ కాలం మనలేదు. అమలు జరగలేదు.ప్రస్తుతం పరిస్థితి పరిశీలిస్తే ద్విచక్రవాహనాలు నాల్గవ గేటు దాటి జ్ఞాన ప్రసూనాంబ అతిధి గృహం పక్కనే ఉన్న బ్రహ్మగుడి వద్ద పార్కింగ్ స్థలంగా మారింది. వాహనదారులునాల్గవ గేటు నుంచి లోపలకు వెళ్లనపుడు భక్తులకు తగలటం ఇబ్బంది పడుతున్నారు.ఈ విధానం భక్తుల మనోభావాలకు ఇబ్బంది కల్గిస్తున్నాయి. ఇప్పటికైనా భక్తుల మనోభావాలను గుర్తించి పక్కా ప్రణాళిక రూపొందించాలని భక్తులు కోరుతున్నారు.

# వందేళ్ల చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన భోదామృతగిరి దేవస్థానం

## - భక్తి, ప్రకృతి, సంప్రదాయాల నిలయం - ఆడికృత్తిక - కావిళ్ల పండుగకు ఆధ్యాత్మిక కేంద్రం

పులిచెర్ల, ఏప్రిల్ 8, ప్రభాతవార్త

పులిచెర్ల మండలం కె.కొత్తపేట గ్రామ పరిసర ప్రాంతంలో వెలసిన భోదామృతగిరి దేవస్థానం (బోడిగుట్ట) వందేళ్లకు పైబడిన చరిత్రను సొంతం చేసుకున్న ఆధ్యాత్మిక క్షేత్రంగా భక్తుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తరతరాలుగా స్థానిక ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ క్షేత్రం, కేవలం ఒక ఆలయంగా కాకుండా భక్తి, సంప్రదాయం, ప్రకృతి సౌందర్యం సమ్మిళితమైన పవిత్ర స్థలంగా ప్రసిద్ధి చెందుతోంది. ఈ గుట్టపై వెలసిన శ్రీ సిద్ధేశ్వర స్వామి స్థానిక ప్రజలకు కోరిన కోర్కెలను నెరవేర్చే దైవంగా ఆరాధింపబడుతున్నారు. ముఖ్యంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ కుటుంబ సంక్షేమం, పంటలాభం, ఆరోగ్యం, సంతాన సాఫల్యం వంటి కోరికలతో ఇక్కడికి వచ్చి మొక్కులు పెట్టడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

### - ప్రత్యేక ఆకర్షణగా నేత్రాలతో శివలింగం

ఈ క్షేత్రంలోని అత్యంత విశిష్టత శివలింగంపై చెక్కబడి ఉన్న నేత్రాలు. సాధారణంగా శివలింగ రూపాల్లో కనిపించని ఈ ప్రత్యేకత భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. పరమేశ్వరుడు స్వయంగా ఇక్కడికి విచ్చేసే భక్తులను దర్శిస్తాడనే నమ్మకం ప్రజల్లో బలంగా నెలకొని ఉంది. ఈ విశ్వాసం కారణంగా భక్తులు ఈ క్షేత్రాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తున్నారు. స్వామి మనలను ప్రత్యక్షంగా చూస్తున్నాడు అనే భక్తి భావం ఇక్కడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత గాఢతరం చేస్తోంది.

### - ఒకే క్షేత్రంలో అనేక దైవాల సన్నిధి

ఈ గుట్టపై కేవలం శివాలయం మాత్రమే కాకుండా గణాధిపతి శ్రీ గణేశుడు, అలాగే వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కూడా వెలసి ఉండటం ఈ క్షేత్రానికి మరో విశిష్టత. స్థానిక పెద్దల ఆలోచనతో దాదాపు యాభై సంవత్సరాల క్రితం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం, నవగ్రహాలను ప్రతిష్టించారు. మొదటగా శివలింగాన్ని ప్రతిష్టించిన ఈ క్షేత్రం, కాలక్రమేణా మరిన్ని దేవతా విగ్రహాలతో ఆధ్యాత్మిక క్షేత్రంగా విస్తరించుకుంది. నవగ్రహాల సమీపంలో ఈశాన్య దిశగా ఉన్న చిన్న కొలను కూడా ఈ ఆలయానికి ప్రత్యేక శోభను తీసుకొస్తోంది.





### - ఆడికృత్తిక - కావిళ్ల పండుగకు ఆధ్యాత్మిక కేంద్రం

ఈ క్షేత్రంలో ప్రతి సంవత్సరం ఆడికృత్తిక (కావిళ్ల పండుగ) ఎంతో వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తమ తమ కావిళ్లను మొక్కులుగా తీసుకుని గుట్టపైకి వచ్చి సమర్పిస్తారు. ఈ ఉత్సవం కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, గ్రామీణ సాంప్రదాయ భక్తి సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. భక్తులు దేవుని కరుణాకటాక్షాలను పొందేందుకు కుటుంబ సమేతంగా పాల్గొనడం ప్రత్యేకంగా కనిపిస్తుంది.

### - శివరాత్రి ఉత్సవాల వైభవం

భోదామృతగిరి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా లింగోద్భవ పూజలు, ప్రత్యేక అభిషేకాలు, జాగరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. శివరాత్రి మరుసటి రోజు జరిగే సిద్ధ పూజ కార్యక్రమం ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆధ్యాత్మిక గుర్తింపును తెచ్చిపెడుతోంది. అనేక గ్రామాల నుంచి భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందుతారు.

### - పెళ్లి కోరికలు నెరవేర్చే క్షేత్రంగా భక్తుల విశ్వాసం

ఈ దేవస్థానానికి మరో విశిష్టమైన ఆధ్యాత్మిక విశ్వాసం కూడా ఉంది. పెళ్లి కాని యువతీ యువకులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుని, త్వరగా వివాహం జరగాలని మొక్కుకుంటే వారి కోరిక నెరవేరుతుందని స్థానికులు బలంగా నమ్ముతున్నారు.

### - ప్రకృతి ఒడిలో ఆధ్యాత్మిక క్షేత్రం

ఈ క్షేత్రానికి సుమారు 92 ఎకరాల విస్తీర్ణంలో గుట్ట ప్రాంతం ఉండటం విశేషం. ఆలయం చుట్టూ విశాలమైన ప్రదేశం, సహజసిద్ధంగా ఏర్పడిన కోనేరు, ఆహ్లాదకరమైన వాతావరణం భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తున్నాయి. ప్రకృతి అందాలు, కొండపై ప్రశాంత వాతావరణం, పచ్చని పరిసరాలు కలిసి ఈ క్షేత్రాన్ని భక్తులకు మాత్రమే కాకుండా ప్రకృతి ప్రేమికులకు కూడా ఆకర్షణీయంగా మారుస్తున్నాయి.

### - సర్పం కాపలా - స్థానికుల విశ్వాసం

ఈ గుట్టపై నిత్యం ఒక నాగుపాము దేవుళ్లకు కాపలాగా ఉంటుందని స్థానిక భక్తులు విశ్వసిస్తున్నారు. పలువురు భక్తులు గుట్ట పరిసరాల్లో సర్పాన్ని చూసినట్లు చెబుతున్నారు. ఈ విశ్వాసం కారణంగా ఈ క్షేత్రం మరింత ఆధ్యాత్మిక మర్మాన్ని సంతరించుకుంది.

### - స్థానిక స్థాయి నుంచి ప్రాంతీయ గుర్తింపు వైపు

ఇన్ని చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతలు కలిగిన ఈ దేవస్థానం చాలా కాలం పాటు స్థానికులకు మాత్రమే పరిమితమై ఉండటం గమనార్హం. సరైన గుర్తింపు, పూజా కార్యక్రమాల విస్తరణ లేకపోవడం వల్ల విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందలేదు. అయితే ప్రస్తుతం పులిచెర్ల మండలంలోని దాదాపు 30 గ్రామాల ప్రజలు కలిసి ఆలయానికి రహదారి ఏర్పాటు చేసి అభివృద్ధి పనుల్లో పాలుపంచుకోవడం ఈ క్షేత్ర భవిష్యత్తుకు శుభసూచకం. ఇది స్థానిక భక్తి భావం, సామూహిక చైతన్యం, గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలుస్తోంది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కె.కొత్తపేట గ్రామ శివారులో ఉన్న భోదామృతగిరి దేవస్థానం భక్తి, చరిత్ర, ప్రకృతి, సంప్రదాయాల సమ్మేళనంగా నిలుస్తోంది. ఇది కేవలం ఒక ఆలయం మాత్రమే కాదు తరతరాల విశ్వాసం, గ్రామీణ ఆధ్యాత్మికత, సామూహిక సంస్కృతికి ప్రతీక. ఈ క్షేత్రానికి మరింత ప్రచారం, అభివృద్ధి కలిగితే భవిష్యత్తులో ప్రాంతీయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశం ఎంతో ఉంది.